జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | ఆదివారం 10 ఆగస్టు 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## ఈసీ కీలక నిర్ణయం.. ఆ పార్టీలకు ఝలక్

- దేశ ఎన్నికల వ్యవస్థ క్రమబద్దీకరణలో భాగంగా గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఝలక్
- ఆ పార్టీలను రిజిస్టర్ పొలిటికల్ పార్టీల జాబితా నుంచి తొలగిస్తూ ఈసీ కీలక నిర్ణయం
- రాజకీయ పార్టీలకు వర్తించే ప్రయోజనాలేవీ వర్తించని స్పష్టం

## ఆదివాసీల అభివృద్ధితోనే

# రాష్ట్రాభివృద్ధి



- అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- ఆదివాసీలంటే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం
- అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్
- టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి
- గ్రామీణ ఆవాస్ యోజన కింద ఆదివాసీలకు 54 వేల ఇళ్లు నిర్మిస్తాం
- రూ.482 కోట్లతో 5 మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు
- రద్దైన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు

**పాడేరు**

ఆదివాసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని గిరి పుత్రుల్లో మరింత చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టగా దాన్ని తాను కొనసాగిస్తున్నానని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించేందుకు గతంలో తాము జీవో నెంబర్ 3 తీసుకొస్తే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆ జీవోలు రద్దయ్యాయని, రద్దైన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు చేస్తామన్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగిలో - మిగతా3లో



## వివేకా హత్య కేసు.. ఆ సమయంలో సీబీఐకి ఎందుకు అప్పగించలేదు?'

- అసలు వివేకా హత్య కేసు చంద్రబాబు హయాంలో జరిగింది
- కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలైందని, మరి వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు
- శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



## భారత రక్షణ రంగ ఉత్పత్తులు@ రూ.1.51 లక్షల కోట్లు

- గతేడాదితో పోలిస్తే 18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైంది
- 2019-20లో రూ.79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది"



## తిరంగాయాత్రలు, మౌన ర్యాలీలతో స్వాతంత్ర్య వేడుకలు

- ఆగస్టు 14వ తేదీ నుంచి దేశ విభజన గాయాన్ని పురస్కరించుకుని మౌన ప్రదర్శనలు
- బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- రేపటి నుంచి మండల, జిల్లా స్థాయిలో తిరంగా ర్యాలీ
- ఆజాదికా అమృత మహోత్సవం నుంచి బీజేపీ పరంగా ప్రతి సంవత్సరం తిరంగాయాత్రలు

## గిరిజనలు అభివృద్ధి చెందితే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

మెలియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాం

## మద్యం కేసులో

# జగన్ ఫ్యామిలీ

**విజయవాడ**

ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో.. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటయింది. దాదాపు ఈ కేసులో 40 మంది వరకు నిందితులు ఉన్నారు. ఓ 12 మంది అరెస్టు అయ్యారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారు. ఈ కేసులో ఏ 5 నిందితుడిగా ఉన్నారు విజయసాయిరెడ్డి. ఆయన అరెస్టు ఇంతవరకు జరగలేదు. ఈ కేసులో తొలుత అరెస్ట్ అయ్యారు రాజ్ కసిరెడ్డి. అనంతరం వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారిగా పని చేసిన ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, జగన్ సన్నిహితుడు బాలాజీ గోవిందప్ప రెస్ట్ అయ్యారు. అటు తర్వాత మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకుంది సిట్. అక్కడకు కొద్ది రోజులకే రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. దీంతో ఇక తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడిచింది. అయితే ఈ కుంభకోణంలో జగన్ కుటుంబ సభ్యులకు - మిగతా3లో





# భారత స్వయంసమృద్ధిలో యోగా కీలక పాత్ర



**ముంబై :** స్వామి రాందేవ్ దార్శనికత లక్షలాది మందికి యోగాను అందించింది. రైతులకు సాధికారత కల్పించింది. ఆయుర్వేదాన్ని ప్రోత్సహించింది. స్వావలంబనను పెంచింది. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, సాంస్కృతికంగా గొప్ప , ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దేశంగా తీర్చిదిద్దింది. బాబా రామ్‌దేవ్ ప్రతి ఇంటికి యోగాను తీసుకువచ్చారని, కంపెనీ ద్వారా రైతులకు సాధికారత కల్పించారని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించారని పతంజలి ఆయుర్వేదం పేర్కొంది. భారతదేశాన్ని సాంస్కృతికంగా సంపన్నం చేయడంలో ఆయన సహకారం గణనీయంగా ఉందియోగా గురువుగా ప్రసిద్ధి చెందిన స్వామి రామ్‌దేవ్ భారతదేశాన్ని ఆరోగ్యంగా, స్వావలంబనగా మార్చడానికి ఒక ప్రత్యేకమైన దార్శనికతను అందించారని పతంజలి సంస్థ తెలిపింది. బాబా రామ్‌దేవ్ నాయకత్వంలో, పతంజలి ఆయుర్వేదం యోగా, ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడమే కాకుండా భారతదేశ ప్రాచీన సంప్రదాయాలను ఆధునిక అవసరాలతో అనుసంధానించింది. వాటికి కొత్త దిశను ఇచ్చిందని పతంజలి తెలిపిది. ఆరోగ్యకరమైన శరీరం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ ఏ దేశ పురోగతికైనా పునాది అని స్వామి రామ్‌దేవ్ విశ్వసిస్తున్నారు."స్వామి రాందేవ్ , ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో, దేశం ఆరోగ్యం, స్వావలంబనలో ఒక విప్లవాన్ని చూస్తోంది" అని పతంజలి ఆయుర్వేద పేర్కొంది. ఈ సంస్థ యోగాను ప్రతి ఇంటికి తీసుకెళ్లింది, లక్షలాది మంది క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా వారి శారీరక , మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేలా చేసింది. ఒత్తిడి, మధుమేహం , గుండె జబ్బులు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడే కపాల్‌భతి , అనులోమ-విలోమ వంటి ప్రాణాయామం, ఆసనాలను స్వామి రాందేవ్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. అదనంగా, మూలికా మందులు, సౌందర్య సాధనాలు ,ఆహార పదార్థాలతో సహా పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు ప్రజలకు సహజ , శీయ ప్రత్యామ్నాయాలను అందిస్తున్నాయి.""స్వామి రామ్‌దేవ్ స్వప్నం కేవలం ఆరోగ్యానికే పరిమితం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పతంజలి 'ఫామ్ టు ఫార్మసీ' నమూనాను స్వీకరించింది. దీని కింద ఔషధ మూలికలను రైతుల నుండి నేరుగా సేకరిస్తారు. ఇది రైతుల ఆదాయాలను పెంచడమే కాకుండా సేంద్రీయ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించింది. పతంజలి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకుకూడా మద్దతు ఇచ్చింది, చిన్న వ్యాపారాలు పెద్ద మార్కెట్లను పొందే అవకాశాన్ని కల్పించింది." స్వామి రామ్‌దేవ్ దార్శనికత భారతదేశాన్ని ఆయుర్వేదంలో ప్రపంచ నాయకుడిగా మార్చడం కూడా. పతంజలి తన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో అందుబాటులో ఉంచడానికి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆచార్య బాలకృష్ణ 330 కి పైగా పరిశోధనా పత్రాలు, 200 కి పైగా పుస్తకాలు ఆయుర్వేదానికి శాస్త్రీయ పునాదిని అందించాయి" అని పతంజలి ప్రకటించింది. "స్వామి రామ్‌దేవ్ సామాజిక వ్యవస్థాపకత , గ్రామీణాభివృద్ధి చొరవలు ఆయనను లక్షలాది మందికి ప్రియమైన వ్యక్తిగా చేశాయి. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, స్వావలంబన , సాంస్కృతికంగా సంపన్న దేశంగా మార్చడంలో స్వామి రామ్‌దేవ్ సహకారం గణనీయమైనది. ఆయన ప్రయత్నాలు ప్రజల జీవితాలను మెరుగుపరచడమే కాకుండా స్వదేశీ ఉత్పత్తులు , సహజ నివారణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశం ప్రపంచ గుర్తింపును కూడా బలోపేతం చేశాయి" అని పతంజలి పేర్కొంది.

# విమానాలు ఎందుకు రద్దవుతున్నాయి



**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలను విధించే పనిలో ఉండగా.. మరోవైపు ఆ దేశంలో ప్రయాణ సాధనాల్లో అంతరాలు ఏర్పడుతున్నాయి. తాజాగా అమెరికా లోని కొన్ని విమాన సర్వీసులు ఆలస్యంగా సాగగా.. మరికొన్ని విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ప్రపంచంలోని పని దేశాలతో సంబంధాలు ఉన్న అమెరికాలో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం వల్ల చాలా దేశాలకు సమస్యలు ఏర్పడ్డాయి. ఎందుకంటే ఈ విమాన సర్వీసుల ద్వారా కేవలం ప్యాసింజర్స్ మాత్రమే కాకుండా కొన్ని వస్తువుల రవాణా కూడా నిలిచిపోయింది. 800 విమానాలు రద్దు అయినట్లు తెలుస్తోంది. హ్యూస్టన్ లోని టెర్మినల్ మొత్తం ప్రయాణికులతో నిండిపోయిం ది. ట్రాక్ లపై ఎక్కడికక్కడే విమానాలు నిలిచిపోయాయి. అయితే విమానాలు రద్దు కావడానికి సాంకేతిక సమస్యలే కారణమని యునైటెడ్ ఎయిర్లైన్స్ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే పనిలో ఉన్నట్లు ఆ సంస్థ అధికారికంగా తెలిపింది.విమానాలు రద్దు కావడంతో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేటర్ కూడా స్పందించింది. విమానాల రద్దుకు సాంకేతిక సమస్య అని యునైటెడ్ సంస్థ పేర్కొన్నట్లు.. ఎఫ్ ఏ ఏ పేర్కొంది. అయితే ఒక్కచోట ఈ సమస్య ఉండడంతో దేశవ్యాప్తంగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఆదేశించామని తెలిపింది. మొత్తంగా 826 విమాన సర్వీసుల్లో అంతరాయం కలగగా.. 23 విమానాలు పూర్తిగా రద్దు అయినట్లు అమెరికా మీడియా పేర్కొంది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విమానాలు తిరిగి కొనసాగించడానికి సమయం పడుతుందని తెలపడంతో ప్రయాణికులు టెర్మినల్స్ లో నిరీక్షిస్తున్నారు.అయితే చికాగోలోని ఎయిర్లైన్స్ విమాన సంస్థలు ఒక ప్రకటనలు విడుదల చేశాయి. ప్రయాణికుల సౌకర్యార్థం కోసమే విమానాలను రద్దు చేశామని చెప్పారు. సాంకేతిక సమస్యల వల్ల 35% విమానాలు ఆలస్యంగా నడుస్తాయని.. ఆరు శాతం విమానాలు పూర్తిగా రద్దు చేశామని తెలిపారు. ప్రయాణికుల భద్రతా కోసమే ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. మరో ఎయిర్లైన్స్ సంస్థ స్పందిస్తూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు చెబుతూనే.. మంచి కోసమే విమానాల సర్వీసులు రద్దు చేశామని తెలిపింది. కవైపు భారత్, అమెరికాల మధ్య సుంకాల విషయంలో చర్యలు కొనసాగుతున్న వేళ ఒక్కసారిగా ఇలా విమానాలు రద్దు కావడంపై ప్రయాణికులతో పాటు అమెరికాలో ఉండే భారతీయులు ఆందోళన చెందుతున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ చేసుకుంటున్న తరుణంలో ఇప్పటివరకు భారత్ పై ఉన్న 25% నుంచి 50% వరకు సుంకాలు పెంచినట్లు ట్రంపు తెలిపారు. అయితే ఇదే సమయంలో విమాన సర్వీసులు రద్దు కావడంపై తీవ్ర చర్చ సాగుతోంది.

# పాక్‌కు చెందిన 5 యుద్ధ విమానాలు కూల్చేశాం

## ఆపరేషన్ సిందూర్‌పై ఐఏఎఫ్ చీఫ్



**బెంగళూరు:** పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు భారత్ గట్టి దెబ్బకొట్టింది. మన సైన్యం జరిపిన మెరుపుదాడులతో శత్రు సేనల స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ ఆపరేషన్‌పై తాజాగా వాయు సేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. 'సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను మన సైన్యం కూల్చేసినట్లు తెలిపారు. దాయాది వాయుసేన సామర్థ్యానికి జరిగిన నష్టంపై భారత్ ప్రకటన చేయడం ఇదే తొలిసారి. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధిం చిన వివరాలను పంచుకున్నారు. "పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాం. అది చాలా హై-టెక్ యుద్ధం. కేవలం 80-90 గంటల్లోనే మా లక్ష్యాల్లో చాలావరకు సాధించాం. యుద్ధం ఇలాగే కొనసాగితే.. భారీ మూల్యం తప్పదని వారికి (పాక్) అర్థమైంది. అందుకే కాళ్ల బేరానికి వచ్చారు. చర్చలు జరుపుదామని సందేశమిచ్చారు. మేం దానికి అంగీకరించాం" అని ఏపీ సింగ్ తెలిపారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన కనీసం ఐదు యుద్ధ విమానాలను కూల్చేశాం. మరో పెద్ద విమానాన్ని కూడా ధ్వంసం చేశాం. మన సైన్యం దాడి చేసిన పాక్ ప్రధాన ఎయిర్‌ఫీల్డ్‌లలో షహబాజ్ జకోబాబాద్ స్థావరం ఒకటి. అక్కడ ఎఫ్-16 హ్యాంగర్ ఉంది. మన సైన్యం దాడితో అది సగానికి పైగా దెబ్బతింది. అక్కడ కొన్ని యుద్ధ విమానాలు ఉన్నాయని, అవి తీవ్రంగా దెబ్బతిన్నాయని మేం అంచనాకు వచ్చాం. ఆపరేషన్ సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ, ఎస్-400 క్షిపణి వ్యవస్థ సమర్థంగా పనిచేశాయి" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు.

## రష్యా ఉప ప్రధానితో అజిత్ దోవల్ భేటీ.. మిలిటరీ-సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన దోవల్.. తాజాగా ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిలిటరీ-సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. పౌర విమానాల తయారీ, రసాయన పరిశ్రమ సహా ఇతర వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించినట్లు పేర్కొంది. కాగా, ఈనెల 7న పుతిన్‌తో దోవల్ భేటీ అయిన విషయం తెలిసిందే. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లతో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు వధించిన వేళ దోవల్ మాస్కో పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోడీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం. అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చించుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

**ఏడాది చివరిలో భారత్‌కు పుతిన్**

పుతిన్ ఈ ఏడాది చివరిలో భారత్‌ను సందర్శించనున్నారు. ప్రస్తుతం ఆయన పర్యటన తేదీలను ఖరారు చేస్తున్నట్లు మాస్కో పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ గురువారం వెల్లడించారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయ్‌గుతో సమావేశమైన ధోవల్ త్వరలో జరగనున్న పుతిన్ భారత పర్యటనపై భారత ప్రభుత్వం ఎంతో ఆసక్తిగా, ఆనందంగా ఉందని చెప్పారు.

## ఈసీ కీలక నిర్ణయం.. ఆ పార్టీలకు ఝలక్




**ఢిల్లీ:** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. దేశ ఎన్నికల వ్యవస్థ క్రమబద్ధీకరణలో భాగంగా గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఝలక్ ఇచ్చింది. ఆ పార్టీలను రిజిస్టర్ పొలిటికల్ పార్టీల జాబితా నుంచి తొలగిస్తూ ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. వరుసగా ఆరేళ్లపాటు ఎన్నికలలో పోటీ చేయని పార్టీలను ఈసీ తొలగించింది. రాజకీయ పార్టీలకు వర్తించే ప్రయోజనాలేవీ వర్తించని స్పష్టం చేసింది. ఏపీకి చెందిన ఐదు పార్టీలు, తెలంగాణలో 13 పార్టీలపై ఎన్నికల సంఘం వేటు వేసింది. కాగా, నిబంధనల ప్రకారం.. కేంద్ర ఎన్నికల సంఘం వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయకపోవడంతో ఈసీ షాక్ ఇచ్చింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పేరుకు మాత్రమే పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి ఎలాంటి కార్యాలయాలు లేవంటూ ఈసీ పేర్కొంది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపు పొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అవ్వగా.. తాజా నిర్ణయంతో ఆ సంఖ్య 2,520కి తగ్గిపోయింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతుండగా.. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా పారదర్శకత పెంచడం.. అవినీతి, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం.. దీనిలో భాగంగా నిబంధనలు పాటించని పార్టీలను తొలగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

## భారత రక్షణ రంగ ఉత్పత్తులు @రూ.1.51 లక్షల కోట్లు



**ఇంటర్నెట్ డెస్క్:** దేశీయంగా రక్షణ ఉత్పత్తులు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల విలువ రూ.1,50,590 కోట్లకు చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే 18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైందని చెప్పారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5లక్షల కోట్లకు చేరుకొని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. గతేడాది 1.27లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 2019-20లో రూ.79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది" అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. డీఆర్‌డీవో, రక్షణ రంగ విభాగాలు సహా అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందన్నారు.

మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ)తో పాటు ఇతర పీఎస్‌యూలు 77శాతం తయారు చేయగా, మరో 33శాతంలో ప్రైవేటు రంగం పాత్ర ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని మన దేశం తగ్గించుకొని, ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యం కూడా భారీగా పెరిగిందన్నారు.

## బిహార్ ఓటమి ఊహించే ఈసీపై రాహుల్ విమర్శలు: కేంద్రమంత్రి




**సాంబ (జమ్మూకశ్మీర్):** త్వరలో జరగబోయే బిహార్ ఎన్నికల్లో ఓటమిని ముందుగానే ఊహించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ విమర్శించారు. ఈసీ, భాజపా కుమ్మక్కయ్యాయంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరికైనా అన్యాయం జరిగిందని భావిస్తే వారు సుప్రీం కోర్టును ఆశ్రయించొచ్చని సూచించారు. ఈసీ అఫిడవిట్ సమర్పించమని అడిగితే పార్లమెంట్‌లో ప్రమాణం చేశానని రాహుల్ గాంధీ తప్పించుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయని కేంద్రమంత్రి గుర్తుచేశారు. అప్పట్లో ఈసీని కొనియాడారని, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు తగ్గడంతో ఈసీని తప్పుబడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఆరోపణల్లో నిజం లేదని, ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని ఊహించి ముందుగానే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాక్‌లో తలదాచుకున్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడమే 'ఆపరేషన్ సిందూర్' ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. కాల్పుల విరమణ, టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యల గురించి మాట్లాడుతూ.. 144 కోట్ల పౌరుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని ఇప్పటికే ప్రధాని మోదీ స్పష్టంచేశారన్న అంశాన్ని ప్రతాప్ రావ్ జాదవ్ గుర్తుచేశారు.

# గిరిజనలు అభివృద్ధి చెందితే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

నందమూరి తారక రామారావు గారు 1982లో గిరిజనుల అభ్యున్నతి కోసం ఐటీడీఏ వ్యవస్థను ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటి నుంచి గిరిజనులకు విద్య, వైద్య, మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రధాన్యత ఇచ్చారని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఏడాదిలో రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. 1000 కోట్ల రూపాయాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికే రూ. 230 కోట్ల రూపాయలు తాగునీరు సౌకర్యం కోసం నిధులు మంజూరు చేశామని అన్నారు. చిన్న తరహ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నటు తెలిపారు. వాటితో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గిరిజన యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు, ఉపాధి అవకాశాలు పొందేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ కేంద్ర ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకు వెలుతున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్ని అమలు చేశామని,తల్లికివందనం,అన్నదాత సుఖీభవ, మహిళలకు గ్యాస్‌సిలెండర్,పింఛన్లు పెంపు, అమలు చేశామని అన్నారు. ఈ నెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక్క పింఛన్లుకు రూ.32వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికే 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో అన్ని గిరిజన గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఫోన్లు సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఇప్పటికే రూ.4 కోట్లతో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉపాధి అవకాశాలు పొందేందుకు 2014-2019 సంవత్సరంలో రుణాలు మంజూరు చేశామని గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని విమర్శించారు.



కార్యక్రమంలో శాసన సభ్యులు బి.రమణమూర్తి, మామిడి గోవిందరావు, జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఆర్డీవో కృష్ణమూర్తి,ఆదివాసీ సంఘ ప్రతినిధులు, పాల్గొన్నారు.

గత ప్రభుత్వం జిల్లాల విభజన అస్తవ్యస్తంగా చేశారు

గత ప్రభుత్వం జిల్లాల విభజన అస్తవ్యస్తంగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు, గిరిజన గ్రామాల్లో ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేవదని అన్నారు. రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థను చిన్నా భిన్నం చేశారని అన్నారు. రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఎంతమంది ఉన్నా అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి ఒక్కరి మాత్రమే ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్లలో ఇటు వంటి కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాక మల్లి ప్రారంభించామని అన్నారు. జిల్లా విభజనలో మన్యంకు వెల్లిన ఐటీడీఏను కొత్తగా మెలియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

# ఆదివాసీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. టూరిజం అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### గిరిపుత్రుల మధ్య ఉండటం సంతోషాన్నిస్తోంది

'ఈ రోజు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. అంతర్జాతీయ గిరిజన దినోత్సవం%ౌ%అన్నా చెల్లెళ్ల అనుబంధం చాటే రాఖీ పండుగ. ఇలాంటి పవిత్రమైన రోజున పాడేరులో ఇలా గిరిపుత్రులు మధ్యలో ఉండటం నాకు సంతోషాన్నిస్తోంది. పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాను. గతంలో పాడేరు రావాలనుకున్నా వాతావరణం అనుకూలించక రాలేకపోయాను. ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం. ఇక్కడికి వస్తున్న సమయంలో కొండలు, పచ్చటి వాతావరణం చూశాను. మళ్లీ జన్మ ఉంటే ఇక్కడ పుట్టాలని ఉంది. విత్తన పండుగలు, సంక్రాంతి వరకూ ఎంతో పవిత్రంగా జరుపుకుంటారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు... దాన్ని నేను కొనసాగిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్

'గిరిజనుల సంక్షేమంతో పాటు ఆ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గతంలో ఐఎఎస్ అధికారులను ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా నియమించి ఐటీడీఏలను బలోపేతం చేశాం. రాష్ట్రంలో ఎస్టీలు 28.32 లక్షలు కాగా అందులో సుమారు 8.41 లక్షలు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 3,77,051 మంది గిరిజనులకు ప్రతినెలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నాం. పక్క రాష్ట్రాలు చత్తీస్గడ్, ఒడిశాలో ఎంత పెన్షన్ ఇస్తున్నారో ఒకసారి గమనించండి. గిరిజనులకు పింఛన్ల కోసమే ఏడాదికి రూ.1,595 కోట్లు ఖర్చు చేస్తున్నాం... ఇదీ గిరిజనుల సంక్షేమంపై మా చిత్తశుద్ధి. 4.82 లక్షల గిరిజనుల గృహాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ఉచితంగా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడతాం' అని సీఎం హామీ ఇచ్చారు.

### మట్టిలో మాణిక్యాలు గిరి పుత్రులు

'మన గిరిజన బిడ్డలు మట్టిలో మాణిక్యాలు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని నమ్మాను. తల్లికి వందనం పథకం ద్వారా 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 4,86,803 మంది గిరిజన విద్యార్థులకు రూ.642 కోట్లు తల్లుల ఖాతాలో వేశాం. ఏజెన్సీ పరిధిలోని స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్న 1,76,796 మంది గిరిజన విద్యార్థులు కోసం ఏడాదికి రూ.1,337 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గిరిజన యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళల తయారీ, ఈ-కామర్స్ విక్రయాలపై శిక్షణ ఇస్తున్నాం. నిన్ననే విద్యాశాఖ మంత్రి 373 నూతన భవనాల నిర్మాణానికి రూ.45 కోట్లు విడుదల చేశారు' అని సీఎం చంద్రబాబు వివరించారు.

### గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు

'ఆదివాసీల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. గిరిజన గ్రామాల్లో వైద్యానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. 1,487 మంది సికిల్ సెల్ రోగులకు నెలకు రూ.10,000 పింఛన్ ఇస్తున్నాం. గర్భిణీలకు పోషకాహార ప్యాకేజీలు, రవాణా సదుపాయం అందిస్తున్నాం. డోలీ మోతలు లేకుండా 76 బర్త్ వెయిటింగ్ హాల్స్ బలోపేతం చేశాం. 35 కొత్త భవనాలు నిర్మాణంలో ఉండగా 15 మరమ్మతులు చేస్తున్నాం. 122 ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేశాం. రూ.482 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### అరకు కాఫీ అంటే ఒక బ్రాండ్

'అరకు కాఫీ ప్రపంచవ్యాప్తం కావాలి. అరకు కాఫీ నేను ప్రమోట్ చేసిన బ్రాండ్. ప్యారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేశాం. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు అవుతోంది. దీనిపై 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలు పెంచాలని ప్రయత్నం చేస్తున్నాం. అలాగే 1.80 లక్షల ఎకరాల్లో చెర్రీ సాగు చేసి 90,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. మన గిరిజన రైతన్నలు మామిడి, సపోటా, జీడిపప్పు, పనస, నేరేడు, నిమ్మ, సీతాఫలమే కాదు కుంకుమవంటి పంటలు సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకప్పుడు ఏజెన్సీ అంటే గంజాయి ప్రాంతమని చెడుగా భావించేవారు. గత ప్రభుత్వం స్వచ్ఛమైన ఏజెన్సీలను కలుషితం చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఏజెన్సీలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడటంలేదు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### రోడ్ల నిర్మాణంతో గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం

'ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు నిర్మించి గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం. నేషనల్ హైవే సంస్థ ఆధ్వర్యంలో ఏడాదిలో రూ.200 కోట్లతో 203 గిరిజన గ్రామాలకు 269 కి.మీ. మేర బీటీ రోడ్లు వేశాం. ప్రస్తుతం గిరిజన జిల్లాల మీదుగా 515 కి.మీ. పొడవున రూ.8,570 కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. వీటిలో పాడేరు%-%గొండిగూడ, కొయ్యూరు%-%చాప్రతిపాలెం, చింతపల్లి, రంపచోడవరం%-%కొయ్యూరు %చీఎ-516జు% విస్తరణ పనులు, రాయపూర్%-%విశాఖపట్నం సెక్షన్ %చీఎ-130జణ%, భద్రాచలం%-%కుంట%చీఎ-%30 సెక్షన్, లంబసింగి%-%పాడేరు, చింతూరు%-%మోటు సెక్షన్లు, పాడేరు బైపాస్, కొత్త ఫ్లై ఓవర్లు ఉన్నాయి' అని సీఎం తెలిపారు.

### విజయవాడ, తిరుపతి, విశాఖలో స్టడీ సర్కిళ్లు

'పోటీ పరీక్షలకు ఎస్టీ విద్యార్థులను సిద్ధం చేయడానికి రూ.4.5 కోట్లు ఖర్చు చేస్తున్నాం. విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. రూ.150 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలు వసతి గృహాలుగా మార్చుతున్నాం. రూ.64 కోట్ల వ్యయంతో ఐటీడీ పాడేరులో 418 పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టాం. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు ఆస్పత్రి నిర్మాణం చేపట్టాం. ఐటీడీఏ రంపచోడవరంలోని వై రామవరం మండలాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం 2 మండలాలుగా విభచించాలని నిర్ణయం తీసుకున్నాం. వీటితో పాటు రూ.50 కోట్లతో సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్‌పురం, శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. త్వరలోనే వీటిని పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తెస్తాం.' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ హామీల అమలు

'ఆర్థిక సమస్యలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. మా గిరిజన ఆడబిడ్డలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ఏజెన్సీలో 7 క్యాంటీన్ల ద్వారా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెలాఖరున మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం భర్తీచేస్తాం. ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఈ పెట్టుబడుల ద్వారా 9 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆదాయం వచ్చేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

### గిరిజన యూనివర్సిటీని పూర్తి చేస్తాం

1483 గిరిజన హ్యాబిటేషన్లకు రూ.2,850 కోట్ల వ్యయంతో గ్రామీణ సడక్ యోజన కింద ప్రతి ఊరికి రోడ్డు వేస్తాం. రూ.1938 కోట్ల వ్యయంతో ఐటీడీఏలో గిరిజనుల ఆదాయం పెంచే మార్గాలు చూపిస్తాం. రూ.8575 కోట్లో వ్యయంతో 515 కిలోమీటర్ల రహదారులు పూర్తి చేస్తాం. రూ.19,411 కోట్లతో 472 కిలోమీటర్లు అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్లు వేస్తాం. ఎకో టూరిజం కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తాం. విజయనగరం జిల్లా కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజ్ పనులు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లాలో 519 ఎకరాల్లో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం త్వరిగతగతిన పూర్తిచేస్తాం.' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి

అరకు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాలను టూరిజం క్లస్టర్లుగా తయారుచేస్తాం. రాబోయే రోజుల్లో స్థానికంగా 1000 వరకూ హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకునేలా ఆర్థిక సాయం చేస్తాం. పాడేరులో మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నాం. స్థానికంగా మహిళా శిశు సంక్షేమం కింద 96 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. విశాఖ జిల్లాలో గిరిజనులందరికీ గ్రామీణ ఆవాజ్ యోజన కింద 54 వేల ఇళ్లు మంజూరు చేస్తాం. బాబాయిని చంపి నెపం నాపై వేద్దామని కుట్ర చేసిన వారి ఆటలు ఇక సాగనివ్వను. వారి ముసుగులు తొలగించి మీకు రక్షణ కల్పిస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## వివేకా హత్య కేసు..

## ఆ సమయంలో సీబీఐకి ఎందుకు అప్పగించలేదు?'

**విశాఖ.** వైఎస్ వివేకానంద హత్య కేసుకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. వివేకానంద హత్య కేసులో లేనిపోని ఆరోపణలు చేసే బదులు.. ఆ కేసును సీబీఐతో విచారణ చేయించడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని బొత్స నిలదీశారు. అసలు వివేకా హత్య కేసు చంద్రబాబు హయాంలో జరిగిందని, మరి ఆ సమయంలో ఎందుకు సీబీఐకి అప్పగించలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఆ కేసును సీబీఐకి అప్పగించిన విషయాన్ని ఈ సందర్భంగా బొత్స గుర్తు చేశారు. మరి ఇప్పుడు కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆ కేసును ఎందుకు సీబీఐకి అప్పగించడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలైందని, మరి వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు. ఈరోజు(శనివారం, ఆగస్టు 9) విశాఖ నుంచి మాట్లాడిన బొత్స.. వివేకా హత్య కేసులో ఆధారాలుంటే బయటపెట్టొచ్చు కదా అని బాబును సూటిగా ప్రశ్నించారు. '14 నెలలు నుంచి చంద్రబాబు ఏమి చేస్తున్నారు. సిగ్గు లేకుండా చంద్రబాబు మాట్లాడుతున్నారు. ఎన్నికలు కోసమే వివేకానంద హత్య గురించి మాట్లాడుతున్నారు. వచ్చే నాలుగు ఏళ్ళు ఇదే అంశం చంద్రబాబు మాట్లాడుతారు' అంటూ మండిపడ్డారు.

## తిరంగాయాత్రలు,

## మౌన ర్యాలీలతో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ :** రేపటి నుంచి ఏపీవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. శనివారం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి బీజేపీ నేతలతో పీవీఎన్ మాధవ్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 14వ తేదీ నుంచి దేశ విభజన గాయాన్ని పురస్కరించుకుని మౌన ప్రదర్శనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రేపటి నుంచి మండల, జిల్లా స్థాయిలో తిరంగా ర్యాలీ నిర్వహించాలని సూచించారు పీవీఎన్ మాధవ్. ఆజాదికా అమృత మహోత్సవం నుంచి బీజేపీ పరంగా ప్రతి సంవత్సరం తిరంగాయాత్రలు నిర్వహిస్తున్నామని వ్యాఖ్యానించారు. రేపటి నుంచి 14వ తేదీ వరకు తిరంగాయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరంగాయాత్రలు నిర్వహిస్తూ స్థానికంగా స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను పరిశుభ్రం చేయాలని సూచించారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల వద్దకు వెళ్లి అక్కడ స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించాలని దిశానిర్దేశం చేశారు పీవీఎన్ మాధవ్ . వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలను పరామర్శించి, అంజలి ఘటించాలని సూచించారు. ఆగస్టు 14వ తేదీ దేశ విభజన జరిగిన రోజును.. ఒక కాళరాత్రిగా జాతీయ వాదులం అందరం భావిస్తామని చెప్పుకొచ్చారు. అందువల్ల ఆ రోజు జిల్లా స్థాయిలో విభజన సమయంలో ఏర్పడిన పరిస్థితులపై ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఈనెల(ఆగస్టు) 14వ తేదీ సాయంత్రం క్యాండిల్ లేదా కాగడాలను చేత బూని మౌన ర్యాలీలు నిర్వహించి ర్యాలీ అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడాలని సూచించారు పీవీఎన్ మాధవ్. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జాతీయ జెండాను బీజేపీ శ్రేణులు తమ ఇళ్లపై కుటుంబ సభ్యులతో కలసి పతాక ఆవిష్కరణలు చేసి సెల్ఫీ తీసుకోవాలని సూచించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో, బహిరంగ ప్రదేశాల్లో పతాక ఆవిష్కరణలకు స్థానికులను భాగస్వామ్యం చేసి ఒక పండుగ వాతావరణంలో ఆగస్టు 15 వేడుకలు నిర్వహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

## మద్యం కేసులో జగన్ ఫ్యామిలీ

-మొదటిపేజీ తరువాయి

సైతం ప్రముఖంగా వినిపించాయి.తొలి ఛార్జ్ షీట్లో జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావనకు తరచూ వచ్చింది. దీంతో అంతిమ లబ్ధిదారుడు ఆయనేనన్న టాక్ వినిపించింది. జగన్ అరెస్టు జరుగుతుందని కూడా ప్రచారం జరిగింది. అయితే ఇది రాజకీయ కక్షపూరిత కేసుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానించింది. ఈ కేసు నిలబడదని కూడా చెప్పుకొచ్చింది. కానీ ప్రత్యేక దర్యాప్తు బృందం లోతైన విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో లిక్కర్ కుంభకోణంలో ఉన్న నిందితులకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో దర్శనం ఇచ్చాయి. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు డబ్బుల నోట్ల కట్టలు లెక్కబెడుతూ కనిపించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. మరోవైపు చార్టెడ్ ఫ్లైట్లో ప్రముఖ హీరోయిన్ తో ఉన్న సెల్ఫీ కూడా హల్చల్ చేసింది. ప్రత్యేక విమానంలో డబ్బుల నోట్ల కట్టలు తరలిస్తున్న ఫోటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవన్నీ మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ము అని.. తాడేపల్లి ప్యాలెస్ కు తరలించే ప్రయత్నంలో భాగంగా చిక్కిన ఫోటోలేనని టిడిపి కూటమి ఆరోపిస్తోంది. అయితే సిట్ చేతికి ఇలాంటి ఫోటోలు, వీడియోలు చాలా చిక్కినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఈ లిక్కర్ కుంభకోణంలో ప్రధాన నిందితులంతా జగన్మోహన్ రెడ్డికి బంధువులేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆయన జగన్మోహన్ రెడ్డికి సమీప బంధువు అని టిడిపి సీనియర్ నేత ఆనం వెంకట రమణారెడ్డి వెల్లడించారు. 2019 ఎన్నికలకు ముందు రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా చేరిన మరుక్షణం ఆయన జగన్మోహన్ రెడ్డి కోటరీలో చేరిపోయారు. మద్యం కంపెనీలు నిర్వహించే రాజ్ కసిరెడ్డికి జగన్ ఈమధ్య కుంభకోణం బాధ్యతలు అప్పగించినట్లు వెంకట రమణారెడ్డి ఆరోపించారు. అయితే రాజ్ కసిరెడ్డి ఎవరో కాదని.. వైయస్ సుజాత రెడ్డి స్వయానా అల్లుడని సంచలన ప్రకటన చేశారు ఆనం. స్వయానా మేనత్త అల్లుడు కావడం, మద్యం వ్యాపారంలో అనుభవం ఉండడంతోనే జగన్ తన కోటరీలోకి రాజ్ కసిరెడ్డిని తీసుకొచ్చారని టిడిపి నేత తాజాగా ఆరోపించారు. తద్వారా ఈమద్యం కుంభకోణంలో వైయస్ కుటుంబ సభ్యుల హస్తం ఉందని ఆరోపిస్తోంది తెలుగుదేశం పార్టీ.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని మార్చారు. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపింది. ఈ తరుణంలో మద్యం తయారు చేసే కంపెనీలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. డిష్టలరీలను సైతం తమ చెప్పు చేతల్లోకి తెచ్చుకొని.. భారీగా కమీషన్లు దండుకున్నారని తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అనుమానం వ్యక్తం చేసింది. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దాదాపు 18 వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని.. 3500 కోట్ల రూపాయలు వైసీపీ నేతలు కొల్లగొట్టారని సిట్ తేల్చింది. అయితే ఈ మొత్తం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు జగన్ అన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే మద్యం కుంభకోణమే అన్నదే జరగలేదని వైసిపి ఆరోపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి రాజ్ కసిరెడ్డి సమీప బంధువు అని తేలడం మాత్రం కొత్త మలుపు తిరిగినట్లు అయింది. ఈ అంశాన్ని టిడిపి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికైతే మద్యం మకిలి జగన్ కుటుంబానికి అంటిందన్నమాట. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

# రొయ్యల సాగుకు అమెరికా షాక్

**ఏలూరు :** అమెరికా రొయ్యల దిగుమతులపై అదనంగా 25% సుంకం విధించడంతో భారతదేశంలోని ఆక్వా రైతులకు, వ్యాపారులకు భారీ దెబ్బ తగిలింది. ఈ కొత్త సుంకాల వల్ల దేశంలో రొయ్యల సాగు రంగం భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన నెలకొంది. మన రొయ్యల ధరలు పెరిగితే, ఈక్వెడార్ లాంటి దేశాలు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే భారత్ ఎలాంటి చర్యలు తీసుకోవాలి?ఇప్పటికే మన దేశ రొయ్యల ఎగుమతులపై అమెరికా 8% వరకు యాంటీ-డంపింగ్, కౌంటర్‌వైలింగ్ సుంకాలను విధిస్తోంది. ఇప్పుడు కొత్తగా విధించిన 25% సుంకం కలవడంతో మొత్తం పన్ను భారం 33%కి పెరిగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఈ టారిఫ్‌లను ప్రకటించడానికి ముందు ఈ సుంకం కేవలం 7.5% మాత్రమే ఉండేది.2011 నుంచి 2023 వరకు, భారత రొయ్యల సాగు రంగం ఏటా సగటున 18% వృద్ధిని నమోదు చేసింది. ఈ అద్భుతమైన వృద్ధికి ప్రధాన కారణం ఎగుమతులే. ముఖ్యంగా అమెరికా నుంచి ఉన్న అధిక డిమాండ్ ఈ వృద్ధికి కీలక పాత్ర పోషించింది.2023-24లో భారతదేశం అమెరికాకు ?2.5 బిలియన్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఇది అమెరికా మొత్తం రొయ్యల దిగుమతుల్లో దాదాపు 38% వాటా. ఈక్వెడార్ (21%), ఇండోనేషియా (17%), వియత్నాం (11%) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి.అయితే, ఇప్పుడు పోటీ తీవ్రంగా మారింది. ఈక్వెడార్ ప్రస్తుతం 18% సుంకాన్ని మాత్రమే ఎదుర్కొంటోంది. ఇండోనేషియాకు 35% నుంచి 25.3%కి, వియత్నాంకు 46% నుంచి 20%కి సుంకాలు తగ్గాయి.భారత్‌కు మాత్రం సుంకం 33%కి చేరడంతో, మన అతిపెద్ద పోటీదారు అయిన ఈక్వెడార్‌తో పోలిస్తే 14-15 శాతం ప్రతికూలత ఏర్పడింది. ఈ భారీ సుంకాల అంతరం అమెరికా మార్కెట్‌లో మన పోటీతత్వాన్ని, వాటాను తగ్గించే ప్రమాదం ఉంది. దీనివల్ల మన ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, రైతులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది.ఈ సుంకాల పెంపుకు ముందే భారత దేశంలో రొయ్యల రైతులు అధిక ఉత్పత్తి ఖర్చులతో సతమతమవుతున్నారు. మొత్తం ఉత్పత్తి ఖర్చులో 60% వరకు రొయ్యల మేతకే పోతుంది. గత మూడేళ్లలో మేత ధరలు 25-30% పెరిగాయి. దీనికి కారణం చేపల పిండి, సోయాబీన్ వంటి మేత పదార్థాల ధరలు పెరగడం, రూపాయి విలువ తగ్గడం.తెల్ల రొయ్య సాగు చేసే చిన్న, మధ్య తరగతి రైతులకు సగటు ఉత్పత్తి ఖర్చు కిలోకు ?280- ?300కి చేరింది. అయితే, కిలో సగటు అమ్మకపు ధర ?340 నుంచి ?360 మధ్య ఉంది. దీంతో లాభాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఒకవేళ అమ్మకపు ధర ?280 కన్నా తగ్గితే, చాలా మంది రైతులు నష్టాల్లో కూరుకుపోతారు.ప్రస్తుతం పండుగల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎగుమతి కోసం స్టాక్ చేస్తున్న నేపథ్యంలో, భారత ఎగుమతిదారులు ఈ అదనపు సుంకాల భారాన్ని భరించాల్సి రావచ్చు. ఇది వారి లాభాలను మరింత తగ్గిస్తుంది. చివరికి ఈ ప్రభావం తక్కువ లాభాలతో పనిచేస్తున్న రైతులపై పడుతుంది.ఈ సంక్షోభం దేశంలో రొయ్యల సాగుకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. మన రాష్ట్రం దేశంలో మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 82% కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది.

## సంపాదకీయం

# శాంతిదూత కాదు.. యుద్ధ పిపాసి

ఒకసారి ఓడి నాలుగేళ్ళ తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చి, అమెరికా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టడం చాలా అరుదైన అంశం. అలాంటి అరుదైన అవకాశం దక్కిన అమెరికా అధ్యక్షుల్లో గ్రోవర్ క్లీవ్ లాండ్ ఒకరు కాగా, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరొకరు. ట్రంప్ రెండవసారి అధికారంలోకి రావడానికి అమెరికాలో స్థిరపడ్డ భారతీయులూ తమవంతు కృషిచేసారు. ఎన్నికల వరకు భారత్ తన మిత్రదేశం, మోడీ తన మిత్రుడంటూ పొగిడిన ట్రంప్‌కు అధికారం రాగానే అహం నెత్తికెక్కింది. అక్రమ వలసదారులంటూ అత్యంత చులకన చేసి, కొంత మంది భారతీయులకు సంకెళ్ళు వేసి యుద్ధ విమానాల్లో భారత్‌కు పంపించి, అత్యంత అవమానకరంగా ప్రవర్తించిన ట్రంప్ భారత్‌పై ఇంకా తన అక్కసును వెళ్ళగక్కుతూ భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని ప్రయత్నించడాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాలి. అధ్యక్ష ఎన్నికల ముందు వరకు రష్యాకు అనుకూలంగా, పుతిన్ కు రహస్య మిత్రుడిగా పేరొందిన ట్రంప్ తన అవసరం తీరగానే రష్యా పైన, రష్యాకు చిరకాల మిత్రదేశమైన భారత్‌పైన అసూయతో రగిలిపోతూ, టారిఫ్‌ల రూపంలో అర్థరహితమైన ఆంక్షలు విధించడం అనైతికం. ఏఏదేశాలు ఎవరితో స్నేహం చేయాలో, ఎవరి వద్ద ఆయుధాలు కొనాలో నిర్ణయించడానికి అమెరికాకున్న హక్కేమిటి? అర్హతలేమిటి? ప్రపంచాన్ని శాసించమని ట్రంప్‌కు ఎవరు అధికారమిచ్చారు? ఇతర దేశాలపై అమెరికా కర్ర పెత్తనమేమిటి? ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలకు అమెరికా ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం కారణం కాదా? రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా నాయకత్వంలోని నాటో దేశాల నిర్వాకమే మూల కారణం. రష్యాతో చమురు ఒప్పందం కుదుర్చుకోవడమే భారత్ చేసిన తప్పిదంగా అమెరికా భావించడం, భారత్ రష్యాతో ఆయుధ, ఇతర వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మానుకోకపోతే అధిక టారిఫ్‌లు విధిస్తానని ప్రకటించి, అనుకున్న విధంగానే భారత్‌పై రెండు విడతలుగా 50% వరకు సుంకాలు విధించడం, ఇదే సందర్భంలో చిరకాల ప్రత్యర్థిగా భావించే చైనాపై కేవలం 30 శాతం టారిఫ్ విధించి, టారిఫ్ అమలుకు ఎక్కువ గడువును ప్రకటించడం ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలకు దర్పణం పడుతున్నది. మిత్ర దేశమంటూనే భారత్‌కు వెన్నుపోటు పొడవడం ద్వారా ప్రపంచానికి ట్రంప్ ఇచ్చే సంకేతమేమిటి? భారత్ ఆర్థికంగా బలపడకూడదనే ఏకైక లక్ష్యమే ట్రంప్‌లో అగుపిస్తున్నది. రష్యాఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కు సంబంధం ఏమిటి? భారత్ రష్యాతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండడం వలన రష్యా ఆర్థికంగా బలపడి ఉక్రెయిన్‌పై యుద్ధం చేయగలుగుతుందనే ట్రంప్ వాదన సత్యదూరం. ఉక్రెయిన్‌కు అమెరికా, నాటో దేశాలు ఆయుధ సహకారం అందించకపోతే ఇన్ని సంవత్సరాలుగా ఉక్రెయిన్ రష్యాతో యుద్ధం చేయగలిగి ఉండేదా? నాటోలో చేరాలనే జెలెన్ స్కీ నిర్ణయమే పుతిన్ ఆగ్రహానికి, ఉక్రెయిన్‌తో యుద్ధానికి మూలకారణం. ఇప్పటికైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు తమ దేశం నాటోలో చేరబోదనే హామీ ఇవ్వగలడా? అమెరికా అందుకు ఉక్రెయిన్ ను ఒప్పించగలదా? ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి చరమగీతం పలుకుతానని ప్రగల్భాలు పలికిన డొనాల్డ్ ట్రంప్, యుద్ధం ఆపలేక చివరికి ఉరిమురిమి మంగళం మీద పడినట్టు నెపమంతా భారత్‌పై నెట్టి, ప్రతీకార సుంకాలతో భారత్‌ను బెదిరించడం దశాబ్దాల ప్రజాస్వామ్య అమెరికా చరిత్రకు మాయనిమచ్చ. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీనుంచి తప్పుకుని ట్రంప్‌కు మద్దతునిచ్చిన రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ భారత్‌పై ట్రంప్ విధిస్తున్న వాణిజ్య సుంకాలను తప్పుబడుతూ, భారత్ వంటి బలమైన దేశంతో సంబంధాలను తెంపుకోరాదని సూచించడం గమనార్హం. అమెరికాలో ఇప్పటి వరకు ఎంతో మంది అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. కాని ట్రంప్ వంటి నాయకుడొస్తే ఏం జరుగుతుందో బహుశా అమెరికన్లు ఊహించి ఉండరు. ఇప్పటివరకు తాను ఆరు యుద్ధాలను ఆపానని, తాను లేకపోతే అణ్వాయుధ యుద్ధం జరిగి ఉండేదని, భారత్- పాక్ మధ్య కూడా తానే మధ్యవర్తిత్వం వహించి, యుద్ధాన్ని నివారించానని ట్రంప్ పదేపదే పేర్కొనడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ ఇంతగా దిగజారిపోవడం సిగ్గుచేటు. ఉగ్రవాద దేశమైన పాక్‌కు మద్దతునీయడమే కాకుండా ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ సైనికాధిపతి మునీర్‌తో కలిసి శ్వేతసౌధంలో విందారగించడం ట్రంప్ దిగజారుడు తనానికి నిదర్శనం. అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించానని చెబుతున్న అమెరికా నేడు ఆర్థికంగా పతనమైపోయింది. ఇతర దేశాల బలహీనతలపై దెబ్బకొట్టి, కొర్రీలుపెట్టి పరాన్నజీవిలా మనుగడ సాగించే దుస్థితి అగ్రరాజ్యానికి ఏర్పడడం దౌర్భాగ్యం. తమ వద్దే ఆయుధాలు కొనాలని అమెరికా వాంఛించడం మూర్ఖత్వం. శాంతి వచనాలు వల్లించే అగ్రరాజ్యాధినేత ట్రంప్‌కు ఆయుధాలతో సంబంధమేమిటి? ఒక యుద్ధ పిపాసికి నోబెల్ శాంతి పొందాలన్న ఆశ, ఆరాటం ఎందుకు? అమెరికాపట్ల భారత్ జాగరూకత వహించాలి. భారత్‌పై కక్షతో అమెరికా అధ్యక్షుడు పాక్‌కు ఆయుధ ,ఆర్థిక సహాయం చేసే అవకాశముంది. ఆర్థికంగా పతనమై, ప్రజల తిరుగుబాటుతో ఛిన్నాభిన్నమవుతున్న పాక్‌కు అమెరికా వత్తాసు పలకడమేమిటి? భారత్ ఆర్థిక వ్యవస్థను మృత ఆర్థిక వ్యవస్థగా పేర్కొనడమే కాకుండా భారత్‌లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టవద్దని, భారతీయులకు ఉద్యోగాలివ్వరాదని ట్రంప్ బెదిరించడం హాస్యాస్పదం. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారతీయుల స్థానం కీలకమైనది. ఈ విషయాన్ని విస్మరించడం ట్రంప్ హ్రస్వదృష్టికి నిదర్శనం. అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా, భారత్ ఎప్పటి మాదిరిగానే రష్యాకు మిత్రదేశంగా మెలగాలి. అమెరికా దురహంకారానికి లొంగకుండా భారత్ అన్ని రంగాల్లో స్వావలంబన సాధించాలి.

# ఆదివాసీ హక్కుల హననం ఇంకెన్నాళ్లు?



కొండకోనల్లో గలగలాపారే సెలయేళ్ళ మధ్య, పచ్చని ప్రకృతివడిలో జీవించే ఆదివాసీల హక్కులు, సంస్కృతులు, భాషలు, జీవనశైలుల గురించి చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినం ముఖ్యఉద్దేశాన్ని మరచి మూడు దశాబ్దాలకు పైగా అయింది. పాలకులు దీన్ని ఒక జాతరలాగా లేదా ఒక పండుగగా దీన్ని మార్చేశారు. అభివృద్ధి పేరుతో జరుగుతోన్న విధ్వంసం వారి జీవితాల పాలిట శాపంగా మారింది. నేటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్యావకాశాలు గానీ, కనీస మౌలిక సదుపాయాలు గానీ వారికి అందుబాటులోకి రాలేదు. తమదైన ప్రత్యేక ఆచార వ్యవహారాలను, హక్కులను కోల్పోతున్నారు. తాము పోరాడి సాధించుకున్న హక్కులు క్రమంగా ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. అటవీ వనరులపై ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యలపై 1982 ఆగస్టు 9వ తేదీన జెనీవాలో 26 మందితో ఒక సమావేశాన్ని నిర్వహించారు. 140 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలోనే అంతర్జాతీయ ఆదివాసీ దినం తేదీని ఖరారు చేశారు. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం నేటికి ఐదువేల ఆదివాసీ తెగలు, 6700 భాషలు మనుగడలో ఉన్నాయి. మన దేశంలో 467 ఆదివాసీ తెగలు ఉండగా, వాటిలో 92% ఈనాటికీ అడవిపైనే ఆధార పడి, అర్ధాకలితో జీవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 37 కోట్ల మంది ఆదివాసీలు వివిధ రకాల వివక్షలు ఎదుర్కొంటున్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతుల రక్షణ కోసం ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానాలు, విధానాలు, అభివృద్ధి ఆశయాలు ఆచరణలో తుంగలో తొక్కేస్థితి. ఆదివాసీల అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితిలో సంతకం చేసిన భారతదేశంలో ఆదివాసీలపై అనుసరిస్తున్న అత్యంత అమానుష విధ్వంసకాండ ఫలితంగా నిలువనీడ కూడా లేని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం చేపడుతోన్న ఆదివాసీ వ్యతిరేక చర్యలు వారిని నిత్యనిర్వాసితులుగా తయారు చేసింది. ద్రౌపది ముర్ముకి రాష్ట్రపతి పదవి ఇచ్చినంత మాత్రానే మోడీ ప్రభుత్వం ఆదివాసీలకు ఎంతో చేసినట్లు ప్రచారం చేస్తోంది. కానీ కనీసం రాష్ట్రపతి స్వగ్రామంలో సైతం కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడాన్ని కప్పిపెడుతోంది కేంద్రంలోని ప్రభుత్వం. 805 ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని 1980లో వేసిన భూరియా కమిషన్ చేసిన సిఫార్సులను సైతం బుట్టదాఖలు చేశారు. ఐదవ షెడ్యూల్‌లో ఈ ఆదివాసీ గ్రామాలు లేకపోవడం వల్ల 1 ఆఫ్ 70 లాంటి చట్టాలు అమలు కావడం లేదు. ఆదివాసీ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం, తమ సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణ కోసం శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా ఆదివాసీలు అనేక హక్కులు సాధించుకోగలిగారు. ఆ ఉద్యమాల ఫలితంగా 1 ఆఫ్ 70 చట్టం, పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టాలు ఆదివాసీలు సాధించుకోగలిగారు. కానీ ఆచరణలో అవి అమలు చేయడంలేదు. ఇక అడవులనూ, వనరులనూ, ఖనిజాలనూ కార్పొరేట్లకు ధారాదత్తం చేసే ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం చేస్తోంది. అదానీకి, అంబానీకి, మిట్టల్‌కు అటవీ సంపద కట్టబెడుతోంది మోడీ ప్రభుత్వం. అంతకంటే ఘోరంగా 2019లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం చట్టప్రకారం ఆదివాసీలుగా నిర్ధారించబడని వారంతా నేరస్థులు. కనుక వారిని అడవుల నుంచి గెంటివేయాలన్న తీర్పు ఆదివాసీల నెత్తిన కత్తిలా వేలాడుతూనే ఉంది. అటవీ, అటవీయేతర భూములను, ఉమ్మడి భూములను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయడానికి పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు ఆటంకంగా వున్నందున వీటిని నిర్దాక్షిణ్యంగా రద్దు చేయడానికి అటవీ సంరక్షన నియమాల పేరుతో 2023 లో తీసుకొచ్చిన చట్టంతో ఆదివాసీలు ఇప్పటి వరకు పోరాడి సాధించుకున్న అన్ని హక్కులూ అణచివేతకు గురవుతాయి.

మరోవైపు ఆపరేషన్ కగార్ పేరుతో, మావోయిస్టు రహిత భారత్‌ను సృష్టిస్తామంటూ మోడీ ప్రభుత్వం ఆదివాసీలపై యుద్ధం ప్రకటించింది. గత మార్చిలో చత్తీస్ గఢ్ రాష్ట్రంలో 7000 ఎకరాల్లోని చెట్ల నరికివేతకు నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో గత మే నెలలో 2324 ఎకరాల్లో 1,23,000 చెట్లు నరికివేతకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో బైలదిల్లా 1, బైలదిల్లా 2, బైలదిల్లా 3 గనులను ప్రైవేటుపరం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన దంతెవాడ, కాంకేరు జిల్లాల్లో 7000 ఎకరాల గనులు 50 సంవత్సరాలకు లీజుకిచ్చారు. బాక్సైట్ ఖనిజాల కోసం తూర్పు కనుమలు జల్లెడ పడుతున్నారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం టెండర్లు పిలిస్తే 58 జాతీయ, అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు దానికి హాజరయ్యారంటే ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్నదేమిటో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఎపిఒ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేస్తోన్న చర్యలు ఆదివాసీల జీవితాల్లో కల్లోలం సృష్టిస్తున్నాయి. అటవీ భూములలో టైగర్ జోన్లు, ఎలిఫెంట్ జోన్లు, ఎకో టూరిజం సౌకర్యాలు వంటి కొన్ని అటవీయేతర కార్యకలాపాలను ప్రభుత్వం అనుమతిస్తోంది. వీటికి ప్రపంచ బ్యాంకు నిధులను సమకూరుస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా భారత దేశంలో గత 50 ఏళ్ళలో దాదాపు 5 కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఆదివాసీ ప్రాంతాల్లోని దీర్ఘకాలిక పోషకాహార లోపం, రక్తహీనత వారిని అనారోగ్య కుహరంలోకి నెడుతోంది. రక్షిత మంచినీరు, వైద్యం వారికి అందని ద్రాక్షగానే మిగిలింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీలు తమ హక్కుల కోసం, ప్రత్యేక సంస్కృతీ సాంప్రదాయాల రక్షణకోసం, అడవులు, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజ మార్పుకోసం జరిగే ఉద్యమాల్లో ఆదివాసీల హక్కుల సాధన కూడా ఒక భాగం. ఆ ఉద్యమాల ద్వారానే ఆదివాసీల హక్కుల సాధన సాధ్యమవుతుంది.

# బీహార్‌లో ఈసీ ఘరానా మోసం




ఎన్నికల సంఘం (ఎలక్షన్ కమిషన్-ఇ.సి) తాజాగా విడుదల చేసిన అడ్వర్టయిజ్‌మెంట్ల హడావుడి పచ్చి కపటత్వానికి పరాకాష్టగా వుంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా తాను చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓట్ల పరిశీలన(సర్)లో అందరినీ కలుపుకుని పోతున్నట్టు చాటుకునేందుకే అది ఉద్దేశితమైంది. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలూ పాల్గొంటున్నాయని ఆ అడ్వర్టయిజ్‌మెంట్ చెబుతున్నది. ఇప్పటి వరకూ దేశంలో తీసుకువచ్చిన ఎన్నికల సంస్కరణ లన్నీ ఇ.సి, రాజకీయ పార్టీల భాగస్వామ్యంతోనే జరిగాయి. ఆఖరుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎం.సి.సి) కూడా రాజకీయ పార్టీల ఏకాభిప్రాయం ప్రాతిపదికతోనే రూపొందింది. ఎం.సి.సి కి ఎలాంటి రాజ్యాంగ ఆధారం లేకున్నా ఈ పద్ధతికి వున్న బలం, దృఢత్వం వల్ల దాని అమలుకు సవాళ్లు లేకుండా పోయాయి. బీహార్‌లో సర్ నేపథ్యంలో జాతీయ పార్టీలన్నీ ఇ.సి తో చర్చలు జరిపినా ఈ భారీ కసరత్తు చేపట్టబోతున్నట్టు కనీస సూచనగా కూడా చెప్పింది లేదు. కనుక ఇ.సి చెబుతున్నట్టు ఇది అందరి భాగస్వామ్యంతో నడుస్తున్నదనడం కన్నా సత్యదూరం మరేమీ వుండదు. ఏమైనా, ఈ విషయంలో మొదటి దశలో ఇ.సి ఒక బూటక లక్ష్యం వెల్లడించిన తీరులోనే తేలిపోయింది. ఇది అత్యంత ఆందోళన కలిగించేదని. ఇది ఏ విధంగానూ పున:పరిశీలన కానే కాదు. నిజానికిది మొత్తం తిరగదోడే తతంగం. స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పిన తీరు మౌలికంగా వయోజన ఓటింగు హక్కు ప్రాతిపదిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి గొప్ప నమూనాగా తీర్చిదిద్దబడింది. మొదటి ఎన్నికల కమిషనర్ దీనికి రెండు ప్రాథమిక కొలబద్దలపై వాస్తవ రూపమిచ్చారు. మొదటిది- సర్వజనులకూ ఓటు హక్కు ఇవ్వడం. రెండవది-ఓటర్ల జాబితా రూపకల్పన బాధ్యత ఎన్నికల సంఘానిది తప్ప వ్యక్తిగతంగా ఆ ఓటర్లపై వుంచకపోవడం. రాజ్యాంగంలోని 326వ అధికరణం సార్వత్రిక ఓటు హక్కు కల్పించాలని స్పష్టంగా చేస్తున్న నిర్దేశం వల్లనే ఇది జరిగింది. పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఏ సమయంలోనూ ఓటరుపై పెట్టింది లేదు. 326వ అధికరణాన్ని గనక లోతుగా పరిశీలిస్తే ఓటు హక్కు సార్వత్రిక కల్పనపై తప్ప పౌరసత్వంపై వక్కాణింపు ఇవ్వలేదు. ఓటర్ జాబితాల పరిశీలన నిరంతరం జరుగుతుంటుంది. ఆ విధంగా తాజా పర్చే ప్రక్రియకూ భరోసా వుంటుంది. ప్రస్తుత ఇ.సి పరమ పవిత్రమైందిగా చెబుతున్న 2003 ఓట్ల సవరణలో కూడా ఓటర్ల నుంచి పౌరసత్వ ఆధారం ప్రత్యక్షంగా అడిగింది లేదు. ఇ.సి పాత రికార్డులు, ఆ కాలపు మీడియా నివేదికలు ఈ వాస్తవానికి నిదర్శనంగా వున్నాయి. కానీ సర్ ప్రక్రియ కృత్రిమంగా సృష్టించిన పేరు గనకే ఈ రికార్డులలో ఎక్కడా కనిపించదు. అది సమగ్రమైంది కాదు, స్థూలమైందీ కాదు. ఇది పౌరసత్వాన్ని నిరూపించే బాధ్యత ఓటరుపై మోపుతున్నది. మొదటి నుంచి అనుసరిస్తున్న ప్రాథమిక సూత్రాలకే ఇది వ్యతిరేకం. జులై 27న ఇ.సి విడుదల చేసిన పత్రికా ప్రకటన మేరకు 7.24 కోట్ల నమోదు (ఎన్యూమరేషన్) పత్రాలు సేకరించబడ్డాయి. ఈ పేర్లు మాత్రమే రిజిస్టర్‌లో చోటు పొందుతాయి. కానీ 2025 జూన్ 24న సర్ ప్రారంభించిన రోజున రాష్ట్ర ఓటర్ల జాబితాలో 7.89 కోట్ల ఓట్లు వున్నాయి. మిగిలిన వారు చనిపోయారనీ (22 లక్షల మంది) తమ నివాసాన్ని శాశ్వతంగా మార్చుకోవడమో లేక ఆచూకీ తెలియకపోవడమో (36 లక్షలు) జరిగిందనీ, ఒకటి కన్నా ఎక్కువ చోట్ల నమోదైనారనీ (7 లక్షలు) ఇ.సి చెబుతున్న మాట. తక్కిన వారు కారణమేదైనా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడటం లేదని (వీరి సంఖ్య చెప్పడం లేదు) అంటున్నది. సర్ ఉత్తర్వు ప్రకారం ఈ 65 లక్షల మందికి ఓటర్ల జాబితా డి.ఇ.ఆర్ లో చోటు వుండదు. నిజంగా ఇంత పెద్ద సంఖ్య చాలా ఆందోళన కలిగిస్తుంది. 2020 ఎన్నికలలో బీహార్ ఓటర్ల సంఖ్య 7.36 కోట్లయితే 2025లో అంతకన్నా తక్కువగా వుంటుందన్న మాట. గత రికార్డులను బట్టి చూస్తే ఇది అత్యంత అసాధారణ పరిణామం. అదే అనేక ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఎవరైనా సరే శాశ్వతంగా రాష్ట్రం నుంచి వలస వెళ్లిపోయారని నిర్ధారించే ముందు ఒక్కొక్కరి విషయమై క్షుణ్ణంగా విచారణ జరపాల్సిన అవసరం వుండదా? కేవలం 30 రోజులలో 36 లక్షల మంది వ్యక్తులు శాశ్వతంగా వలస పోయారని విచారణ చేయడం ఎలా సాధ్యమవుతుంది? బీహార్‌కు చెందిన వలస కార్మికులపై చేసిన ఒక అధ్యయనం ప్రకారం వారిలో 90 శాతం మందికి ఈ ఫారాలు సమర్పించడం మాట అటుంచి అసలు సర్ గురించి తెలియనే తెలియదు. ఇక పెద్ద సంఖ్యలో చనిపోయినట్టుగా ప్రకటించిన వారి విషయానికి వస్తే 2025 సంపూర్ణ జాబితాలో ప్రస్తావనే లేకుండా దీన్ని ఎలా నిర్ధారిస్తారన్నది కూడా ప్రశ్న. ఒక్కసారి గనక అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా మొత్తం డి.ఇ.ఆర్ ప్రచురించినట్టయితే ఇది మరింత స్పష్టమవుతుంది. తీవ్రమైన తేడాలున్నట్టు అర్థమవుతుంది. జాబితా ప్రామాణికత గురించి ఒక అంచనాకు రావడానికి వీలుగా ప్రముఖ సెఫాలజిస్టు యోగేంద్ర యాదవ్ ఓటరు జనాభా నిష్పత్తి (ఇ.ఆర్) అనేది రూపొందించారు. జులై నెల మొదట్లోనే బహుళ పార్టీల ప్రతినిధివర్గం కలుసుకున్నప్పుడు బీహార్ ఓటర్ల జాబితాలో 20 శాతం బూటకమని సి.ఇ.సి ప్రకటించారు. ఆ కారణంగా వాటిని తొలగించాలని సి.ఇ.సి చెప్పిన నేపథ్యంలో ఈ లెక్క అవసరమవుతుంది. అసలు మొత్తం ప్రక్రియ ముగియకుండానే ఇలాంటి నిర్ధారణ ప్రకటించడమంటే దాన్ని ముందే నిర్ణయించారనీ, ఇష్టానుసారం నిర్ణయించారని భావించాల్సి వుంటుంది. జనాభా అంచనాలపై సాంకేతిక బృందం నివేదిక (2019) లోనూ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు రాష్ట్రాల వారీగా సంవత్సరాలు, వయస్సుల వారీగా జనాభా లెక్కల ప్రాతిపదికన తయారు చేసిన అంచనాలు ఇందుకు అత్యుత్తమమైన ఆధారవనరుగా వుంటాయి. ఇటీవల అంటే జనవరి 2025లో కూడా భారత ప్రభుత్వం, ఇ.సి.ఐ లు ఈ అంకెలనే ఉపయోగించుకున్నాయి. డి.ఇ.ఆర్ లో అర్హులైన ఓటర్ల సంఖ్యను ఆ వయస్సుల వారీ సంఖ్యతో భాగిస్తే ఇ.ఆర్ నిష్పత్తి వచ్చేస్తుంది. ఈ స్కోరు వంద శాతం వస్తే బాగా చక్కగా సరిపోయినట్టు భావించాలి. 2024లో చూస్తే ఈ అఖిల భారత స్కోరు 99 శాతం వుంది. తేడా ఒక్క శాతమే గనక ఇది ఆరోగ్యకరమైన పరిస్థితి. 97 శాతం స్కోరుతో బీహార్ జాతీయ సగటు కంటే కొంత వెనకబడి వుంది. అంటే ఆ ఓటర్ల జాబితా పెంచడంగాక కొంచెం తగ్గించబడిందని భావించాలి. జూన్ 24న సర్ ప్రకటన వెలువడిన రోజున బీహార్‌లో ఇ.ఆర్ నిష్పత్తి 97 శాతం. అప్పటికి ఇ.సి చెప్పినట్టు సర్ ప్రకారం మరింత కుదించక ముందే అంత తక్కువగా వుందన్నమాట. గత అయిదు ఎన్నికలతో పోలిస్తే ఇది చాలా ఆకస్మికమైన తీవ్రమైన తగ్గుదల. అంతేగాక మిగిలిన అన్ని రాష్ట్రాల కన్నా తక్కువగా వుంది.

# బాపట్లలో ఆదివాసి దినోత్సవం రాజకీయ ప్రజా హాజరుతో ఉత్సవ వాతావరణం





**బాపట్ల, ఆగస్టు 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం బాపట్ల కలెక్టరేట్ ఆవరణలోని ఈటీసీ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ జీ. గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జీ. ప్రకాశరావు అధ్యక్షత వహించారు. తొలుత ప్రార్ధనాగీతం ఆలపించగా, అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభలో మాట్లాడిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ,ప్రపంచ నాగరికతకు ముందే ఆదివాసీలు ఉన్నారు. వారు మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తోంది. కానీ చెప్పుకోదగిన అభివృద్ధి ఇంకా జరగలేదు. విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యం. పెద్దలు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఉన్నత విద్యను సాధించాలి. గిరిజనుల నైపుణ్యానికి పదును పెట్టి, వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు కృషి చేస్తాను అని చెప్పారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు నేషనల్ ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ రాము, యానాది హక్కుల సంఘం అధ్యక్షుడు తిరువీధుల శంకర్ ఆధ్వర్యంలో, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రకాశరావుతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం గిరిజన సంఘాలతో కలిసి ర్యాలీగా సభా స్థలికి చేరుకున్నారు.సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి రాజ్ దెబోర, గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్ఇ అనంత రాజు, గిరిజన నాయకులు ప్రసంగించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, చిన్నారులు సాంప్రదాయ వేషధారణలో నృత్యాలతో ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఒక్కసారిగా కూలిన వంతెన గమ్య స్థానం చేరలేక ఇబ్బంది పడ్డ ప్రయాణికులు





**సిద్ధవటం ఆగస్టు 9** సిద్ధవటం బద్వేలి రహదారి సేద్దోటం చెక్పోస్ట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం రహదారి గుండా భారీ వాహనాలు వెళ్లడంతో బ్రిడ్జి ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది బద్వేల్ నుండి కడపకు వెళ్లే ఆర్టీసీ వాహనాలు ఆటోలు అట్లూరు ఫారెస్ట్ చెక్పోస్ట్ వద్దనే నిలిచిపోయాయి కడప నుండి బయలుదేరే ఆటోలు బస్సులు ద్విచక్ర వాహనదారులు ఎటు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది గమ్యస్థానానికి చేరుకోవాలంటే కొంతమందికి వాహనాలకు పెట్రోల్ పట్టించేందుకు లేక తమ స్నేహితులకు ఫోన్ చేసి డబ్బులు తెప్పించుకోవడం జరిగింది మరి కొంతమంది ప్రయాణికులు రోడ్డు అవతలి వైపుకు నడుచుకుంటూ వెళ్లి ఆటోల ద్వారా గమ్యస్థానం చేరుకున్నారు ఈ విషయం తెలిసిన వెంటనే సిద్ధవటం పోలీసులు కూలిపోయిన బ్రిడ్జి వద్దకు చేరుకొని వాహనాలను రావద్దని వెనక్కి పంపించడం జరిగింది వంతెన నిర్మాణం చేపట్టి వరకు ఎవరు రావద్దని ప్రస్తుతం చెక్పోస్ట్ గేటు మూసి వేయడం జరుగుతుందని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు

# శ్రేష్ట పథకం విద్యార్థులకు ఉన్నత చదువుల్లో స్థానికత కల్పించాలి

**అరుంధతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు(తిరుపతి) శ్రేష్ఠ మాదాసి ప్రసాదరావు**

**(ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 09** కర్నూలు: ఆయా రాష్ట్రాల్లో దేశవ్యాప్తంగా శ్రేష్ట పథకం ద్వారా విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉన్నత చదువుల్లో స్థానిక కల్పించాలి అరుంధతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు(తిరుపతి) శ్రేష్ఠ మాదాసి ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని అక్షయ శ్రీ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి శ్రేష్ఠ మాదాసి ప్రసాదరావు , ప్రముఖ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల అధిపతి (తిరుపతి) వెంకటేశ్వర్లు పాల్గొని జీవో నెంబర్ 20 ప్రకారం శ్రేష్ట పథకం ద్వారా ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పైన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రేష్ట విద్యార్థుల పట్ల శాపంగా మారిన ఈ జీవో నుండి ఎస్సీ విద్యార్థులకు మినహాయింపునిస్తూ ఫీజు రీయింబర్స్మెంట్, హాస్టల్ వసతులను కల్పిస్తూ స్కాలర్షిప్లను మంజూరు చేయాలని కోరారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వంది గనక రాష్ట్రాల విషయానికొచ్చేసరికి నాన్ లోకల్ గా పరిగణిస్తున్నందుకు మెరిట్ ఉన్నప్పటికీ మెరుగైన కళాశాలలో సీటు పొందలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మన బిడ్డల కోసం సమిష్టిగా కలిసి పోరాడాలని, సోమవారం గ్రీవెన్స్ డే ఉంటుంది కాబట్టి అన్ని జిల్లాల నుండి జిల్లా కలెక్టర్లకి విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తిగతంగా వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం శ్రేష్ట ప్రసాద్ రావు , వెంకటేశ్వర్లు ని కర్నూల్ ట్రిబుల్ ఈ గ్రూపు కుటుంబ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాజన్న, నరసింహ రాజు రాముడు, స్వామి గోపాల్, వెంకటరాముడు హుస్సేన్



నాగార్జున(అక్షయ శ్రీ ఫౌండేషన్ చైర్మన్), ఎమ్మార్పీఎస్ నాయకులు తిమ్మన్న, ఏపిఎం సుబ్బయ్య, శేఖర్, నరసన్న, బోయేజ్ తదితరులు పాల్గొన్నారు.

# పొందూరు మండలంపై ఎందుకీ పక్షపాతం

- సాధారణ సర్వ సభ్య సమావేశంలో రైతులు, అధికారుల మధ్య నెలకొన్న చర్చ
- ఎరువుల కొరత తో రైతుల ఆందోళన
- మండలంలో ఎరువుల సకాలంలో అందకపోవడానికి కారణం ఏంటి :మాజీ ఎంపీపీ కూన ప్రమీల
- జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేస్తున్నారు
- జిల్లాలో ఒక మండలం అయినా పొందూరు రైతులకు ఎందుకు ఎరువుల కొరత
- వ్యవసాయా అధికారులను నిలదీసిన సర్పంచులు బుడుమూరు పోలినాయుడు




**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో గంధరగోళం నెలకొంది. ఎరువులు ,యూరియా కేటాయింపులపై సమావేశ వాడివేడిగా జరిగింది. ఈ ఏడాది రైతులకు అత్యంత అవసరమైన యూరియా సకాలంలో సరైన మోతాదులో అందించకపోవడం తో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సర్వ సభ్య సమావేశంలో ఆమదాలవలస ఎమ్మెల్యే సతీమణి ,మండల మాజీ ఎంపీపీ కూన ప్రమీల తో పాటు పలువురు సర్పంచులు ఎంపిటిసిలు అధికారుల ముందు సమస్యను లేవనెత్తారు. జిల్లా లో ఏమండలానికి లేని ఎరువులు యూరియా కొరతతో రైతులు అల్లాడ పోతున్నారన్నారు. అసలు పొందూరు మండలానికి ఎందుకు ఎరువుల కొరత ఏర్పడుతుందని ,కారణాలు చెప్పాలని కూన ప్రమీల ప్రశ్నించారు. దీనికి జిల్లా యంత్రాంగం , వ్యవసాయ అధికారులు ,వ్యవసాయ శాఖ మంత్రి కారణమని పిల్లల వలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు అధికారులను నిలదీశారు. పొందూరు మండలంలో చాలా ప్రాంతాల్లో మొక్కజొన్న ప్రధాన పంటగా వేశారని అధికారులు యూరియా తగిన మోతాదులో సకాలంలో అందించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు మండలము పై ఎందుకు పక్షపాతం చూపిస్తున్నారని ప్రశ్నించారు. కొన్ని నియోజకవర్గాలకు అధిక సంఖ్యలో లోడులు కేటాయించిన అధికారులు పొందూరు మండలానికి ఎందుకు చాలీచాలని కేటాయింపులు చేసారని కేటాయింపులు చేశారని వ్యవసాయ అధికారి శ్రీనివాస రావును ప్రశ్నించారు. అధికారులు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం పై రాష్ట్ర ప్రభుత్వానికి పిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పి. ఏ .సి.ఎస్ అధ్యక్షులు వండాన మురళీ ఎంపీటీసీ అనకాపల్లి వాణి కిలాన సూర్యారావు కిలాన జ్యోతి జాడ పేట గ్రామ సర్పంచ్ జాడ శ్రీను ,ఎంపీటీసీ 1 వడగా పద్మ ,ఎంపిడిఓ మీసాల మన్మథ రావు ,తహసీల్దార్ వెంకటేష్ పి. ఏ .సి.ఎస్ సి.ఈ. ఓ వై పాపినాయుడు పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు,ఏ.పి.యం గురుగు బెల్లి శ్యామల రావు తాడివలస డాక్టర్ నవీన్ కుమార్ ఎం.ఈ. ఓ పట్నాన రాజారావు సర్పంచులు ఎంపిటిసిలు, ఆర్. డాబల్యా. ఎస్ ఆర్.ఎం.బి తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల రౌండ్ టేబుల్ సమావేశం



**(ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 09 కర్నూలు** విద్యార్థుల హక్కులను హరించే విధంగా నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న విద్యార్థి సంఘాలను పాఠశాలల్లోకి, జూనియర్ కళాశాలల్లోకి అనుమతించరాదని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు విజయవాడ దాసరి భవన్ లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ప్రసంగించారు మరియు వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఒంటిమిట్ట మండల జడ్పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ యువనేత రితేష్ రెడ్డి



**బద్వేల్ ఆగస్టు 9 (ప్రజా జ్యోతి న్యూస్)** శనివారం నాడు రాజంపేట నియోజకవర్గం లోని ఒంటిమిట్ట మండల జడ్పిటిసి ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డికి మద్దతుగా ఒంటిమిట్టలోని అంబేద్కర్ నగర్ లో మంత్రి మండేపల్లి రాంప్రసాద్ రెడ్డి గారితో కలిసి బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కూటమి అభ్యర్థిని గెలిపిస్తే ఒంటిమిట్ట మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలియజేశారు.

## రక్త సంబంధానికి ప్రతీక రక్షాబంధన్...!



**సిద్ధవటం ఆగస్టు 9** శ్రావణ పౌర్ణమి సందర్భంగా సిద్దవటం మండలం వ్యాప్తంగా రాఖీపౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు అన్నాచెల్లెళ్ళు అక్కాతమ్ముళ్ళ అనుబధాలకు ప్రతీక ఈ రక్షాబంధన్ అన్నగా తమ్ముడిగా ఆడబిడ్డకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసానే ఈ రాఖీ పండుగ దీనితో రక్త సంబంధాలు బలపడతాయి ప్రజల నమ్మకం నా అన్న నా చెల్లి నా అక్క నా తమ్ముడు అనే బంధాలు ప్రేమానురాగాలు ఎప్పటికీ నిలిచిపోవాలని ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రాఖీపండుగను ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ మిఠాయిలు తినిపించుకుని ఆడపడుచులకు కనక, ధన, పసుపు కుంకుమ , చీరలు ఆడపడులకు కానుకగా అందిస్తారు. ఆడపడుచులు ఎంతో ఆప్యాయతతో తమ సోదరులకు రాఖీ కట్టి మిఠాయిలు పంచి దీవెనలు పొంది ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ఎన్నికల ప్రచారంలో మంత్రులు



**సిద్ధవటం ఆగస్టు 9** ఒంటిమిట్ట మండలంలో జడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారం వేడెక్కింది. నారా లోకేష్ పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మంత్రి వర్యులు శ్రీ ఫారూఖ్ చిలకలూరిపేట ఎమ్మెల్యే. పార్ధసా రథిరాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్ రాజు గారి నెతృత్వంలో విస్తృత స్థాయిలో ప్రచార కొనసాగుతోంది .పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి, 11వ బూత్ కన్వీనర్ సుబ్బరాయుడు, కరెంటు రమణ, రవి నాయుడు గారు, సుబ్బ నరసయ్య తదితరులు చురుకుగా పాల్గొన్నారు. కూటమి అభ్యర్థి విజయం కోసం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై పనిచేస్తున్నారు.

## గుమ్మిడి నూకరాజు కుటుంబాన్ని పలకరించిన మురళిరాజు



**అన్నవరం ఆగస్టు 9 ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** ప్రతిపాడు మండలం ప్రత్తిపాడు ప్రభుత్వ హాస్పిటల్లో అనారోగ్య కారణంగా జాయిన్ అవ్విన ధర్మవరం గ్రామానికి చెందిన గుమ్మిడి వర తండ్రి నూకరాజు ని పలకరించి ఆరోగ్యం పరిస్థితిని డాక్టర్ సౌమ్య ని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్స్ ను సంప్రదించిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు గారు, కోలా తాతబాబు గారు,బొల్లు నాగేశ్వరరావు గారు,జువ్వల దొరబాబు గారు,నానిపల్లి వెంకన్న గారు,మారెళ్ళ అప్పన బాబు గారు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మండల కేంద్రమైన అనంతగిరిలో ఘనంగా ఆదివాసి దినోత్సవం.



పాల్గొన్న ప్రజలు.ప్రజాసంఘాల నాయకులు.

**అనంతగిరి మండలం ఆగస్టు 9. ప్రజా జ్యోతి రిపోర్టర్ శంకర్.** ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన అనంతగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘం నాయకుడు నాగులు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఆదివాసి జెండాను ఎగరవేసి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రజలు.ప్రజాసంఘాల నాయకులు సంతోషంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిలుగా అనంతగిరి మండలం జిల్లా పరిషత్ సభ్యుడు గంగరాజు. మండల సి.పి.ఎం పార్టీ నాయకుడు కేమోషియా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి బిడ్డలు సుఖ సంతోషాలతో కలకాలం ఉండాలని. అభివృద్ధి బాటలో నడవాలని గిరిజన హక్కులను. చట్టాలను కాపాడుకోవాలని.మన హక్కులను మనము కాపాడుకున్న రోజే మనకు నిజమైన ఆదివాసి స్వతంత్రం వర్ధిల్లుతుందని నాయకులు అన్నారు ముఖ్యంగా కేంద్ర.రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని. జీవో నెంబర్ త్రీ ని పునరుద్ధరణ చేపట్టి గిరిజనులను ఆదుకోవాలని నాయకులు కోరారు ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలప్రజా సంఘాల నాయకులు నాగులు. మోసియా. రవీంద్ర. భీమన్న. మురళి. బాబి చంటి తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి



కొడుకు మరణ వార్త విని గుండెపోటుతో తండ్రి మృతి





**తాళ్లపూడి ,ఆగస్టు9, ప్రజాజ్యోతి న్యూస్** రాఖీ పౌర్ణమి రోజున తాళ్లపూ డి మండలం పెద్దేవం గ్రామంలో విషాదం నెలకొంది. గుండెపల్లి. మణి శంకరం తన సోదరితో రాఖీ కట్టించుకోవడానికి బైక్ పై దేవరపల్లిమండలంయాదవోలు బయలుదేరాడు. గోపాలపురం మండలం వెంకటాయపాలెం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న బైక్, మణి శంకరం బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మణి శంకరం అక్కడిక్కడే మృతి చెందాడు. కొడుకు మరణవార్త విన్న అతనితండ్రి శ్రీను గుండెపోటు తో మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన రెండో వ్యక్తి యాదవోలు గ్రామానికి చెందిన మరపట్ల సువర్ణ రాజు ను చికిత్స నిమిత్తం హాస్పిటల్ కి తీసుకు వెళ్ళగా ఆసుపత్రిలో కన్నుమూ శారు. రాఖీ పండుగ రెండు కుటుంబాలలో విషాదాన్ని మిగిల్చింది

# అక్రమరేషన్ వ్యాపారానికి అడ్డుకట్ట పడేనా?.

అధికారుల కనుసన్నలోనే అక్రమ రేషన్ వ్యాపారం...?
రేషన్ షాపుల నుండి అక్రమ వ్యాపారం....



**కంచికచర్ల ఆగస్ట్ 09 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల, వీరులపాడు మండలాలలో అక్రమ రేషన్ వ్యాపారం యదేచ్ఛగా కొనసాగుతుంది. అక్రమ రేషన్ వ్యాపారులు గుమస్తాల్ని ఏర్పాటు చేసుకొని ఏర్పాటు చేసుకొని మరి వ్యాపారం భారీ ఎత్తున కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 రోజులపాటు ఇవ్వాల్సిన రేషన్ సరుకులు ,రేషన్ డీలర్లు ఐదు రోజులకే రేషన్ సరుకులు అయిపోయాయని చేతులెత్తేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. రేషన్ షాపులు వద్దే బియ్యాన్ని కొనుగోలు చేసి గుమస్తాలు రాత్రి సమయంలో లోడింగ్ చేసుకుని లారీలకు ఎత్తుతున్నారని స్థానికులు అన్నారు. రెండు మండలాల్లో జోరుగా రేషన్ బియ్యం వ్యాపారం జోరందుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరులపాడు మండలంలోని ఓ బడా డాన్ కనుసనల్లోనే ఈ అక్రమ రేషన్ వ్యాపారం కొనసాగుతుందని ఈడాన్ నిన్న మొన్నటి వరకు తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం కొనసాగించి ఈ మధ్యనే మరల కంచికచర్ల వీరులపాడు మండలాలకి తానే డాన్ గా మారి వ్యాపారాన్ని పట్టాలెక్కించాడని స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు. గత ఐదు నెలల క్రితం రేషన్ వ్యాపారాన్ని ప్రారంభించిన ఓ చిన్న డాన్ కమిషన్ తీసుకొని ఓ బడా డాన్ కు రేషన్ తరలిస్తున్నాడని స్థానికులు ఆరోపించారు.ఏది ఏమైనా పేదల బియ్యాన్ని అతి తక్కువ ధర కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న రేషన్ వ్యాపారుల ఆట కట్టించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# జిల్లాలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**రాయచోటి ఆగస్టు 09 ప్రజా జ్యోతి** ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణ పై ప్రజలలో అవగాహన కల్పించేందుకే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్నిజరుపుకుంటున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణ అనే ఉద్దేశాలను ప్రజలందరూ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించేటప్పుడే ఆదివాసీల హక్కుల కోసం అధికరణ 46 అధికరణ 332 వంటి అధికరణలతో ఆదివాసీలకు హక్కులను కల్పించారన్నారు అదేవిధంగా రాజ్యాంగం లోని షెడ్యూల్ 5, 6 లతో ఆదివాసీలకు స్వయం పరిపాలన దిశగా హక్కులను కల్పించారన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు సంబంధించిన పథకాలు హక్కులపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు పై లారీ బోల్తా ఘటనలో క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అన్నమయ్య జిల్లాలోని 12 గిరిజన సంక్షేమ పాఠశాలలు గిరిజన సంక్షేమ హాస్టల్లో వసతులు, విద్యపై మండల ప్రత్యేక అధికారులు తాసిల్దారుల దగ్గర నుండి నివేదికలు అందుతున్నాయని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆదివాసీల ఆధార్ కార్డు ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ ఇదివరకే అధికారులకు తగిన సూచనలు చేశారని తెలిపారు. ఆదివాసీల పథకాలకు సంబంధించిన సమస్యలు భూములకు సంబంధించిన సమస్యలపై జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.



# మాండవ్య నది ఒడ్డున ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో 3వ శ్రావణ శనివారం వేడుకలు

ప్రత్యేక పూజలు మరియు అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు

**రాయచోటి ఆగస్టు 09 ప్రజా జ్యోతి** శ్రావణమాసం 3వ శనివారం సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం మాండవ్య నది ఒడ్డున ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 3వ శనివారం వేడకలు ఘనంగా నిర్వహించారు. కాగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు గారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శనివారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.వారందరికీ అన్నదానం చేశారు, రామనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ బాబు గారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. హాజరైన ప్రసాద్ బాబు గారికి ఆలయ కమిటీ వాకా అన్నయ్య గారు ఆత్మీయ స్వాగతం పలికి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు.



## సంతోషిమాత వార్షికోత్సవం ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా ప్రత్యేక పూజలు



**కాకినాడ ఆగస్టు 9 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు నియోజకవర్గం: ప్రత్తిపాడు గ్రామంలోని జాతీయ రహదారి పక్కన వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయంలో 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.తరువాత ఆమె మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి. అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎన్డీయే కూటమి శ్రేణులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులను వెంటనే అరికట్టాలి

దళిత వేదిక ప్రతినిధుల డిమాండ్.



**గోపవరం ఆగస్టు 9 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు చిన్న ఓబి గాండ్ల ఓబయ్య అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల ప్రతినిధుల సమావేశం నందు ఆయన మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కడప జిల్లా అనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దళితులపైన జరుగుతున్నటువంటి దాడులు ఇటీవల కాలంలో అధిక మయ్యాయని ప్రభుత్వ అధికారులు దళితులపైన జరిగేటువంటి దాడులను వెంటనే అరికట్టాలని పలుచోట్ల దళితుల పట్ల జరుగుతున్న దాడులు అవమానాలు అనుభవిస్తున్న పేద దళిత బడుగు వర్గాల వారికి ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందన్న నమ్మకాన్ని కోల్పోయేట్లు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు జిల్లాలో బద్వేల్ నియోజకవర్గం లో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా దళితుల పట్ల జరుగుతున్న దాడులు అక్రమాలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం గురయ్యా, సిపిఐ బి కోడూరు మండల కార్యదర్శి ఎర్రబల్లి ప్రసాద్ రావు, సీనియర్ దళిత నాయకులు సోమయ్య, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి యోహాను, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్ దావీదు తదితరులు పాల్గొన్నారు.

## పి. ఏ.సి.ఎస్ అధ్యక్షుడు వండాన మురళికి ఘన సన్మానం

– పదవి పొందిన అనంతరం మొదటిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** ఈ మధ్యకాలంలో పొందూరు వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వండాన మురళీ ను శనివారం నాడు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశానికి ఆయన పదవి చేపట్టిన అనంతరం మొట్టమొదటి సారిగా హాజరు కావడంతో శుభాకాంక్షలు తెలుపుతూ ఎంపీపీ కిల్లి ఉషారాణి,పి . ఏ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ ,ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వర రావు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైతులకు పి. ఏ.సి.ఎస్ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ,జిలా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి,పిల్లల వలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు తుంగపేట సర్పంచ్ పప్పల వేణు గోపాలం ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## కంచికచర్ల లో ట్రాఫిక్ కు అంతరాయం





**కంచికచర్ల, ఆగష్టు 9 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల పట్టణంలో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుంది. నెహ్రూ సెంటర్లో ఒకవైపు విజయవాడ, మరోవైపు హైదరాబాదు, ఇంకోవైపు మధిర వెళ్లే రహదారులు చిలతాయి. మూడు వైపులా ఒకేసారి వాహనాలు వచ్చినప్పుడు ఇక్కడ నెహ్రూ సెంటర్లో ఎక్కడికక్కడే అటు ఆర్ అండ్ బి రోడ్ లోనూ ఇటు జాతీయ రహదారి పైన ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతాయి. కూత వేటు దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఉన్న పోలీసులు మాత్రం ఇవి కనిపించవు. మధిర వెళ్ళు రోడ్డులో గొట్టుముక్కల రోడ్డు చిలేచోట్ల అలానే అంబేద్కర్ సెంటర్లో చెవిటికల్లు, కునికిన పాడు, మున్నలూరు తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు నుండి వచ్చే వాహనాలతో ఇక్కడ కూడా రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఆర్టీసీ బస్ స్టేషన్ రెండు వైపులా బస్సులు బస్ స్టేషన్ లోకి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు గేట్లు వద్ద ఆటోలు ఇతర వాహనాలు నిలబెట్టడం వలన ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ప్రతిరోజు ఈ కార్యక్రమం నిత్య కృత్యంగా మారటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పోలీసులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## ములకలచెరువు సీఐగా సి. వెంకటేశులు బాధ్యతలు



**అన్నమయ్య జిల్లా ఆగస్టు 09 ప్రజా జ్యోతి** ములకలచెరువు సీఐగా సి. వెంకటేశులు శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న సీఐ లక్ష్మన్న బదిలీపై కలకడ వెళ్లడంతో ఆ స్థానంలో తిరుపతి జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై సీఐ వెంకటేశు లు ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని రాజకీయ నాయకులు,ప్రజలు సహకరించాలని కోరారు.పార్టీలకు అతీతంగా స్నేహభావంతో మెలగాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని,అక్రమాలకు పాల్పడిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.

# పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గం

**2027 నాటికి జిల్లాను "0" మలేరియా కేసులు కు తేవాలి**

**జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి**

**అన్నమయ్య జిల్లా ఆగస్టు 09 ప్రజా జ్యోతి** పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గమని జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్రారెడ్డి అన్నారు. మలేరియా నిర్మూలనా కార్యక్రమములో బాగంగా రామాపురం ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సూర్యనారాయణ పురం సచివాలయం సుగాలి బీడీకి నందు దోమలనివారణ మందు (ఏసియం) స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు..ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమల నివారణకు స్ప్రేయింగ్ అనేది ప్రతి ఇంటికి చేయించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చునన్నారు .అలాగే ఇండ్ల పరిధిలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని,నీటితొట్లు డ్రమ్ముల్లో నీరు నిలవకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు.దోమల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని,సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారిజయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ క్రీస్టీఫెర్, ఆశ కార్యకర్తలు, స్ప్రే కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. స్ప్రే నిర్వహణ నువిజయవాడ నుండి స్టేట్ కన్సల్టెంట్ కొండారెడ్డి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షణ చేసి సాంకేతిక సలహాలు ఇచ్చారు.




# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

**అన్నమయ్య జిల్లా యువ అధికారి బి. ప్రదీప్ కుమార్**

**అమ్మకు గౌరవం కల్పిస్తూ మొక్కలు పంపిణీ**

**అన్నమయ్య జిల్లా ఆగస్టు 09 ప్రజా జ్యోతి** భారతదేశ ప్రధాని ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరు మీద ఒక చెట్టు) అనే గొప్ప కర్యక్రమాన్ని ప్రారంభించారని ప్రజలు విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాలని భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ ( నెహ్రూ యువ కేంద్రం) అన్నమయ్య జిల్లా యూత్ ఆఫీసర్ బి. ప్రదీప్ కుమార్ తెలిపారు. మై భారత్ సహకారంతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కే నామ్ ప్రోగ్రాం స్థానిక డాక్టర్ గిరిజమ్మ వీధిలోని గ్లోబల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ నందు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక గురుదేవ వశిష్ఠ జూనియర్ కళాశాల నందుమొక్కలు నాటారు.ఈ సందర్భంగా అన్నామయ్య జిల్లా యువ అధికారి బి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా తల్లి లాంటి ప్రకృతిని కాపాడుకున్న వారిమవుతామని వివరించారు. ఈ సృష్టిలో మనుషులే కాకుండా సకల జీవరాసులు వాటి జీవన విధానం ఆనందకరంగా ఆరోగ్యంగా కొనసాగాలంటే ఖచ్చితంగా స్వచ్ఛమైన గాలి, నీరు ఉండాలని తెలిపారు. గాలి కలుషితం కాకుండా స్వచ్ఛంగా ఉండాలంటే ఖచ్చితంగా మొక్కలు అనేవి అధికంగా నాటాలని, తద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలో పండ్లమొక్కలు వంటివి పండించడం ద్వారా ఇంటి అవసరాల ఖర్చు తగ్గించడమే కాకుండా పర్యవరణాన్ని కాపాడ వచ్చున్నారు. మహిళలు ఉపాధిగా ఇది చేపట్టాలన్నారు. అవసరమైతే ముద్ర రుణాలు, ఎస్.సి., ఎస్.టి. లకు సబ్సిడీ రుణాలు పొంది స్థానికంగా పండే పంటలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధి మాట్లాడుతూ పర్యావరణ అసమతుల్యత కారణంగా సమయానికి వర్షాలు పడక పోవడం, ఎండలు అధికం కావడం జరుగుతుందని మొక్కలు నాటి సంరక్షించడమే కాకుండా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని అన్నారు.




# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో రాష్ట్ర ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపేందుకు యత్నిస్తున్నాయి








**: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**గుంతకల్లు ఆగస్ట్ 9 (ప్రజా జ్యోతి):**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత స్మార్ట్ మీటర్ల పేరుతో రాష్ట్ర ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపేందుకు యత్నిస్తున్నా యని,ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ అన్నారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో సిపిఐ గుంతకల్లు పట్టణ 14వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ మహాసభలో రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి తో వివరిస్తుందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు, మీటర్లను ఎవరైనా ఏర్పాటు చేస్తే పగలగొట్టారు అని పిలుపునిచ్చారన్నారు. విద్యుత్ చార్జీలు భారం మోపేది లేదని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ:15 వేల కోట్ల భారం చార్జీల పేరుతో ప్రజలపై మోపిందని తెలిపారు. దీనికి తోడు ఆదానితో ఒప్పందం అమలు చేయడం వల్ల వచ్చే 20 ఏళ్లలో ప్రజలపై రూ:1.25 లక్షల కోట్లు భారం పడుతుందని అన్నారు. అలాగే గుంతకల్లు నియోజకవర్గం లో నియోజ వర్గంలో చెరువులను హంద్రీ జలాలతో నింపాలన్నారు. రాగులపాడు తూము ద్వారా పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలని గుంతకల్లు పట్టణంలో మూతపడిన మిల్లు ఆవరణంలో ఏదైనా పరిశ్రమను స్థాపించి నిరుద్యోగ సమస్యను అరికట్టాలని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్,సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బి గోవిందు, డివిజన్ కార్యదర్శి వీరభద్ర స్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ కార్యదర్శి మహేష్,పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, సాధికారదాసు రామాంజనేయులు, ప్రజా నాట్యమండలి నాయకులు కొల్లాయప్ప, ప్రసాద్, సిపిఐ నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థునులను ఉపాధ్యాయురాలును వేధిస్తున్న ప్రిన్సిపల్ సాయి దివ్య..

**పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను తీవ్రంగా కొట్టి ఇస్తానని చెప్పి బెదిరించిన ప్రిన్సిపల్ సాయి దివ్య..**

**మమ్మల్ని ప్రిన్సిపాల్ మేడం తీవ్రంగా కొట్టి దుర్భాషలాడిందని టీచర్ రామకృష్ణమ్మకు చెప్పిన విద్యార్థునులు..**

**ఎందుకు మేడం విద్యార్థులను కొట్టారని ప్రశ్నించిన సోషల్ టీచర్ రామకృష్ణమ్మను దుర్భాషలాడి నీకు చెప్పాల్సిన అవసరం లేదంటూ బెదిరించిన ప్రిన్సిపల్ సాయి దివ్య**

**అన్నమయ్య జిల్లా ఆగస్టు 09 ప్రజా జ్యోతి** విద్యార్థులకు ఏ రోజు కూడా సరైన సమయానికి మెనూ ప్రకారం సరైన ఆహారం అందించడం లేదని ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు తెలియజేసిన పట్టించుకోవాలని ఆవేదన వ్యక్తం చేసిన టీచర్ రామకృష్ణమ్మ పాఠశాలలో బయట వ్యక్తులు మరియు రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ సాయి దివ్య ప్రిన్సిపల్ సాయి దివ్య నన్ను అసభ్య పదజాలంతో దూషించడంతో అస్వస్థతకు గురై కింద పడిపోయిన నన్ను తోటి ఉపాధ్యాయురాలు అంబులెన్స్ లో ఆసుపత్రికి తీసుకు వెళ్తుంటే ప్రిన్సిపాల్ మేడం నన్ను చెంపల మీద తీవ్రంగా కొట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న టీచర్ రామకృష్ణమ్మ. ప్రిన్సిపల్ సాయి దివ్య కు విద్యార్థుల తల్లిదండ్రులకు తరచూ గొడవలు జరుగుతాయని పోలీసుల జోక్యంతో గొడవలు సద్దుమణుగుతు న్నాయని, పాఠశాలలో తరచూ జరుగుతున్న ఈ గొడవల వల్ల మేము సరిగా పనిచేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న టీచర్ రామకృష్ణమ్మ ప్రిన్సిపల్ సాయి దివ్య చేసే తప్పులను ప్రశ్నించిన నాపై తప్పుడు ప్రచారం చేస్తూ నాకు సోకజ్ నోటీసులు పంపించిందని ఆవేదన వ్యక్తం చేసిన టీచర్ రామకృష్ణమ్మ. ఎటువంటి విచారణ చేయకుండా నాకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారని దయచేసి జిల్లా కలెక్టర్ గారు స్పందించి విద్యార్థులను ఉపాధ్యాయు రాలులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ విద్యార్థులకు సరైన ఆహారం కూడా అందించని ప్రిన్సిపల్ సాయి దివ్యపై పూర్తి విచారణ జరిపి ఆమెపై చర్యలు తీసుకొని నాకు ఆమె జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దుచేసి న్యాయం చేయాలని టీచర్ రామకృష్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.




# ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్ లపై శిక్షణ

**వైయస్సార్ కడప జిల్లా ఆగస్టు 9 ప్రజా జ్యోతి** ఈ నెల 12న జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలనేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జెడ్పి సీఈవో రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ అన్నారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రిసైడింగ్ అధికారులకు,ఏపీవో లకు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,డివిషనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ ,తదితరులు పాల్గొన్నారు.





## ట్రాఫిక్ భద్రతపై అవగాహన



**నందిగామ, ఆగష్టు 9 (ప్రజాజ్యోతి)** నందిగామ పట్టణంలో ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించేందుకు, నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీ ఏ.బి.జి. తిలక్ మార్గదర్శకత్వంలో నందిగామ సిఐ వై.వి.వి.ఎల్. నాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ-2 బదావతు అభిమన్యు పీఎస్ఐలతో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానంగా రెండు చక్రాల వాహనదారులకు హెల్మెట్ ధరించడం, వాహనానికి సంబంధించిన అవసరమైన పత్రాలు (డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సి, ఇన్సూరెన్స్, ప్యాల్యూషన్ సర్టిఫికేట్) తీసుకువెళ్లడం ఎంత ముఖ్యమో వివరించారు.తనిఖీలలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న 30మంది వాహనదారులను గుర్తించారు. వారికి ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించి, తిరిగి ఇలాంటి తప్పిదం చేయకూడదని ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రజలకు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు సూచించారు.

## రాయచోటి లో అన్నా క్యాంటీన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సంయుక్త కలెక్టర్



**రాయచోటి ఆగస్టు 09 ప్రజా జ్యోతి** రాయచోటి లోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ లో భోజనం చేయడానికి వచ్చిన వారిని భోజనం బాగుందా లేదా సౌకర్యాలు ఎలా ఉన్నాయి పరిశుభ్రత ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్న క్యాంటీన్ లోనే భోజనం చేశారు.

## అన్న ప్రసాద వితరణ కు 10,000 రూపాయలు విరాళం అందించిన గుమ్మనూరు బ్రదర్స్.



**గుంతకల్లు ఆగస్టు 9 (ప్రజా జ్యోతి):**కలియుగ దైవం గోవింద నాథుడు శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీవారి సేవకులు నిర్వహించిన శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా కసాపురం గ్రామం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం విచ్చేయుచున్న భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని 10,000 రూపాయల ఆర్థిక సాయం చేసిన గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి మరియు గుమ్మనూరు శ్రీనివాసులు స్వయంగా భక్తులకు అన్న ప్రసాద్ వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సుగవాసి ప్రసాద్ బాబు గారికి రాఖీ కట్టిన బ్రాహ్మా కుమారీస్ వారు



**రాయచోటి ఆగస్టు 09 ప్రజా జ్యోతి** రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం సుగవాసి ప్రసాద్ బాబు గారికి రాఖీ కట్టిన బ్రహ్మ కుమారి వారు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రసాద్ బాబు గారు, అక్కా-తమ్ముడు, అన్నా-చెల్లెలు అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ, ఆడబిడ్డలు అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు గారు

## వైసిపి కార్యాలయంలో ఘనంగా రక్షభంధన్

**రాఖీ పండుగ అనేది కేవలం రక్షణ, ప్రేమ,ఆప్యాయత, నమ్మకాలకు ప్రతీక మాత్రమే కాదు,సోదర బంధానికి ప్రతీక**

**వైసిపి మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్**




**మదనపల్లె ఆగస్టు 09 ప్రజా జ్యోతి** రాఖీ పండుగ అనేది కేవలం రక్షణ, ప్రేమ, ఆప్యాయత, నమ్మకాలకు ప్రతీక మాత్రమే కాదు, సోదర బంధానికి ప్రతీక అని మీ సోదరుడిగా, మీ కుటుంబంలోని ఒక సభ్యుడిగా నేను ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటానని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గ సోదరీమణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ వైసిపి కార్యాలయంలో ఘనంగా రక్షభంధన్ నిర్వహించారు వైసిపి మహిళ నాయకురాల్లు నిస్సార్ అహమ్మద్ కు రాఖీ కట్టి, స్వీట్స్ తినిపించి, దీవెనలు పొంది అభిమానాన్ని చాటుకున్నారు. ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా మీ అందరూ నాపై చూపించిన ప్రేమ, అనురాగం నా హృదయాన్ని ఆనందంతో నింపిందని నిస్సార్ అహమ్మద్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ కుటుంబ విలువలకు ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పండుగ అని, ప్రేమ, అనుబంధంతో రక్షాబంధన వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి, నాగమణి, శారదా రెడ్డి, వినీతా బాయి

# కొత్త మాధవరం లో చేనేత నేతలు మరియు కార్మికులు ఏర్పాటు చేసుకున్న సభలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు





ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుని తో పాటు హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు మరియు ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ గారు

**ఒంటిమిట్ట ఆగస్టు 9 ప్రజా జ్యోతి** ఒంటిమిట్ట మండలం,కొత్త మాధవరం గ్రామంలో జడ్పిటిసి ఉప ఎన్నికలలో భాగంగా చేనేత కార్మికుల ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని పలు అభివృద్ధి హామీలు ఇచ్చి, వారికున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి గారితో మాట్లాడి తొందరలోనే వాటికి పరిష్కారం చూస్తానని ప్రకటించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు ఎమ్మెల్సీ అనురాధ గారు మరియు జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు తో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా జడ్పిటిసి అభ్యర్థితో కలసి ప్రచారంలో పాల్గొన్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు





కొడములూరు గ్రామంలో మంత్రి గారితో పాటు ప్రచారంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు

**ఒంటిమిట్ట ఆగస్టు 9 ప్రజా జ్యోతి** కొడమలూరు, బెస్తపల్లి గ్రామాలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు, జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు మరియు టిడిపి అభ్యర్థి అద్దులూరి ముద్దుకృష్ణారెడ్డి తో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు ఒంటిమిట్టలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం కోసం నాయకులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలి ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడ ప్రజలకు బస్సు సౌకర్యం, సిమెంట్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి

ఒంటిమిట్ట జడ్పిటిసి అభ్యర్థి సుబ్బారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

ఒంటిమిట్ట వై.యస్.ఆర్.సిపి జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపించండి

ఒంటిమిట్ట మండలం మండపంపల్లి పంచాయతీ లో జడ్పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైఎస్ఆర్ సిపి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించిన

కడప వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి గారు

మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష గారు

కడప పార్లిమెంట్ పరిశీలకుడు అజయ్ రెడ్డి గారు

మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి గారు

ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి గారు

జడ్పిటిసి అభ్యర్థి సుబ్బారెడ్డి గారు



**ఒంటిమిట్ట ఆగస్టు 09 ప్రజా జ్యోతి** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుబ్బారెడ్డి గారి గెలుపు ఖాయమని, పులివెందుల మరియు ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలలవుతున్నా ప్రజలకు ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయిందని, ప్రజలు ఎటువంటి పథకాలూ అందుకోవడం లేదని విమర్శించారు ప్రజలు ఈ ఉపఎన్నికలో తమ ఓటుతో ప్రభుత్వం పాలనపై గట్టి సమాధానం చెబుతారని అన్నారు.ప్రజలు ఈ ఎన్నికల లో మీ అమూల్యమైన ఓటుతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు.పాల్గొన పార్టీ ముక్య నాయకులు కార్యకర్తలు అభిమానులుబి

## ఒంటిమిట్ట కస్పా వీధులలో టిడిపి కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు

ఉప ఎన్నికలలో కార్యకర్తలు సమిష్టి కృషితో జడ్పిటిసి స్థానాన్ని టిడిపి కైవసం చేసుకోవాలని కోరారు



**ఒంటిమిట్ట ఆగస్టు 9 ప్రజా జ్యోతి** ఒంటిమిట్ట మండలం నందు టిడిపి కార్యకర్తలతో మరియు బూత్ ఏజెంట్లు తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి అక్కడి కార్యకర్తలకు అవసరమైన పనులు పెట్టిస్తానని హామీ ఇచ్చిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు

## మత పెద్దలతో పీస్ మీటింగ్



**రాయచోటి ఆగస్టు 09 ప్రజా జ్యోతి** ఆగస్టు 10న రాయచోటిలో జరగబోయే బీజేపీ సారధ్యం యాత్రను దృష్టిలో పెట్టుకొని శనివారం రాయచోటి పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులు బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో చర్చించారు. యాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ సాంఘిక కార్యకలా పాలకు ఎవరైనా పాలుపడితే వారి మీద కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

## ఒంటిమిట్ట అభివృద్ధి ప్రజల చేతుల్లోనే,,

మీ ఓటు మీ అభివృద్ధికి బాట,,

సీతాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించిన రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ చమర్తి.



**ఒంటిమిట్ట ఆగస్టు 9 ప్రజా జ్యోతి** ఒంటిమిట్ట అభివృద్ధి ప్రజల చేతుల్లోనే ఉందని,మీ అభివృద్ధి కి మీరు వేసే ఓటు బాటలు వేస్తుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.శనివారం రాచగుడిపల్లి గ్రామపంచాయతీ సీతాపురం లో సీతాపురంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారికి సీతాపురం ప్రజలు ఘన స్వాగతం పలికి వారికి దుశ్యాలువా కప్పి సన్మానించడం జరిగినది. అనంతరం చమర్తి ఇంటింటి ప్రచారంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు పథకాల గురించి వివరించారు. ఒంటిమిట్ట మండలంలో 12వ తేదీన జరగబోయే జెడ్పిటిసి ఎన్నికలలో కూటమి ప్రభు తరపున పోటీ చేస్తున్న ముద్దుకృష్ణారెడ్డిని ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 9 (ప్రజా జ్యోతి)** మూడవ శ్రావణ శనివారం శుభ సందర్భంగా దప్పేపల్లి కస్పా లోని దేవర చలమ శ్రీ ఆంజనేయ దేవస్థానము నందు అన్నదాన కార్యక్రమము నిర్వహిస్తున్నందున దప్పేపల్లి గ్రామ ప్రజల పిలుపుమేరకు ముఖ్యఅతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు టిడిపి యువ నాయకులు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, బోజనాలు పెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండలం క్లస్టర్ కన్వీనర్ యనమల మదన్ మోహన్ మరియు దప్పేపల్లి సర్పంచ్ దాసరి కేశవయ్య ,టిడిపి ముఖ్య నాయకులు కృష్ణమోహన్ రెడ్డి,మురళీ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి,ఆనంద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారులి

## గండి క్షేత్రంలో ఘనంగా ప్రారంభమైన మూడవ శ్రావణ శనివారం ఉత్సవాలు



**వైఎస్ఆర్ కడప జిల్లా ఆగస్టు 9 ప్రజా జ్యోతి** అంజన్నను ప్రత్యేకంగా తెప్పించిన పండ్లు, పూలతో అలంకరించిన ఆలయ పూజారులు కేసరి, రాజా స్వాములు.ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్న పూజారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించిన ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణ తేజ.

## బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాఖీ సంబరాలు



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ స్కూల్ రెడీనెస్ అండ్ బాల వికాస్ ప్రోగ్రాంలో భాగంగా పొందూరు మండలం దల్లవలస గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గల చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో బాలికలు బాలురందరికీ రాఖీలు కట్టి సంబరాలను నిర్వహించారు .ఈ ముచ్చట్లు చూడడానికి వచ్చిన స్థానికులు అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కే .స్వర్ణలత మరియు కమ్యూనిటీ ఆర్గనైజర్స్ కాళ్ళ. శ్రావణి మరియు పి .అప్పలనాయుడు మరియు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి గుడి నందు అన్నదానం మరియు వస్త్ర దానం కార్యక్రమం




**రామాపురం ఆగస్టు 9 ప్రజా జ్యోతి** మూడవ శ్రావణ శనివారం శుభ సందర్భంగా అన్నమయ్య జిల్లా రామాపురం మండలం వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము నందు ధర్మకర్త కర్ణపు సుధాకర్ రెడ్డి ఈరోజు అన్నదానం మరియు వస్త్ర దానం కార్యక్రమం చేయడం జరిగింది. కీర్తిశేషులు కర్ణపు ఈశ్వర్ రెడ్డి గారి జ్ఞాపకార్థం ఆడవారికి చీరలు పంచడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లగుట్ట పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి గారు మరియు వారి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయనిది పథకం ఒక వరం

– ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ, ఆగష్టు 9 (ప్రజాజ్యోతి)** పేదలకు సీఎం సహాయనిధి పథకం ఒక వరమని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి శనివారం సీఎం సహాయ నిధి చెక్కులను 58 మంది లబ్ధిదారులకు 36,07,979 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం నందిగామ నియోజకవర్గంలోని ప్రజలకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. సీఎం సహాయ నిధి పథకం ద్వారా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులకు వైద్యం, విద్య మరియు ఇతర అత్యవసర అవసరాల కోసం ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ,ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు ఒక వరం వంటిది. ఈ పథకం ద్వారా నందిగామ నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమములో లబ్ధిదారులు ,కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్



**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు తాగునీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతినడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరించింది. మరమ్మతులు చేయకపోతే డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని, దిగువన ఉన్న బ్యారేజీలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పిట్టగోడకు చీలిక ఏర్పడిందని.. ఒకవైపు గోడ వంగిందని ప్యానెల్ వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ వివరాలు.. రాజధాని హైదరాబాద్ నగరానికి తాగు నీరు.. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు తాగు, సాగు నీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయకపోతే ఏ క్షణమైనా డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరికలు జారీ చేసింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతిన్నదని.. దీనికి వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్యానెల్ సూచించింది. పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.1976లో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరులో సింగూరు రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించారు. దీని సామర్థ్యం 29.91 టీఎంసీలు. 1989లో ఈ ఆనకట్ట నిర్మాణం పూర్తయింది. హైదరాబాద్ తాగునీటి కోసం దీని నుంచి 6.96 టీఎంసీలు కేటాయించారు. అలానే డ్యాం పరిసర ప్రాంతాల్లో సాగునీటి అవసరాలు తీర్చడానికి, మంజీరా నదిలో పూడికను తగ్గించడానికి ఈ ప్రాజెక్టును నిర్మించారు.డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డీఆర్ఐపీ) కింద సింగూరు ప్రాజెక్టు ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్ అశోక్‌కుమార్ గంజు సారథ్యంలో ఆనకట్ట భద్రత సమీక్షా కమిటీ జూన్ 23న డ్యామ్‌ను పరిశీలించింది. ప్రాజెక్టు పరిస్థితిని వివరిస్తూ, వెంటనే చేపట్టాల్సిన మరమ్మతు పనులను తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.వాస్తవానికి సింగూరు రిజర్వాయర్ డిజైన్ ప్రకారం దీనిలో 517.8 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయాలి. కానీ మిషన్ భగీరథ అవసరాల కోసం 520.50 మీటర్ల వరకు నీరు నిల్వ చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు 2017 అక్టోబరు 30న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి నుంచి కూడా సింగూరు రిజర్వాయర్‌లో అనుమతించిన 520 మీటర్లకు మించి.. 522 మీటర్ల కన్నా ఎక్కువగానే నీటిని నిల్వ చేస్తున్నారని కమిటీ గుర్తించింది. దీనివల్లే జలాశయం దెబ్బతిన్నదని తేల్చింది. కట్ట దెబ్బతినడమే కాకుండా మరమ్మతులకు అవకాశం లేకుండా పోయిందని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది.దెబ్బతిన్న రాతి కట్టడాన్ని వెంటనే సరిచేయకపోతే ఆనకట్టుకు ఏ క్షణంలోనైనా గండి పడే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. ఒకవేళ అలా జరిగితే, దిగువన ఉన్న మంజీరా బ్యారేజీ, నిజాంసాగర్‌తోపాటు చెక్‌డ్యామ్‌లు కూడా దెబ్బ తింటాయని పేర్కొంది. ఆనకట్టకు రక్షణగా ఉన్న పిట్టగోడకు నిలువునా చీలిక వచ్చిందని, ఒకవైపు గోడ వంగి ఉందని వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని అభిప్రాయపడింది.ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి.. వర్షాకాలం అయిపోగానే మరమ్మతులు చేపట్టాలని కమిటీ సూచించింది. కట్ట మరమ్మతులకు అవసరమైన నిధులు డ్రిప్ నుంచి రాకపోవచ్చని, రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని తెలిపింది.ఖ

# కవిత దారెటు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ లీక్ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కేసీఆర్ చుట్టు దెయ్యాలు ఉన్నాయంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు? హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. లేఖను లీక్ చేసిన వారి పేర్లను బయటిపెట్టాలని? పార్టీని ప్రక్షాళన చేయాలంటూ కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీకి దూరంగా ఉంటున్న కవిత?. జాగృతి సంస్థ పేరుతో యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడుతున్నారువరంగల్ సభ తర్వాత కవిత? పార్టీ అధినేత కేసీఆర్ కు రహస్య లేఖ రాశారు. అయితే ఈ లేఖ బయటికొచ్చింది. ఈ విషయాన్ని కవిత తీవ్రంగా పరిగణించారు. పార్టీలోని కొంత మంది కోవర్టులు?లేఖను బయటపెట్టారని ఆరోపించారు. కేసీఆర్ దేవుడని.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. అప్పట్నుంచి ఆమె పార్టీ కార్యాలయానికి కాదు.. వ్యవహారాలకు కూడా దూరంగా ఉంటున్నారు.లేఖ లీక్ తర్వాత? పార్టీపై కూడా కవిత కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. అప్పటి నుంచి ఆ దెయ్యాలు ఎవరు అంటూ కవితను అడుగుతుండగా?. సమయం వచ్చినప్పుడు బయటపెడతానంటూ ఆమె దాటవేస్తూ వచ్చారు. కట్ చేస్తే?.ఆమె పూర్తిగా పార్టీకి దూరంగా ఉంటూ కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లాల వారీగా పర్యటిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు ఎక్కడ కూడా పాల్గొనటం లేదు. కేవలం జాగృతి కార్యకర్తలు, అనుచరులు మాత్రమే ముందు వరుసలో ఉంటున్నా?.కవిత గత కొంతకాలంగా బీసీల అజెండాతోనే ముందుకెళ్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా జాగృతి కమిటీలను కూడా బలపేతం చేస్తున్నారు. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ ను కూడా స్వాగతించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు కూడా తన దారికే వస్తారంటూ కామెంట్స్ చేశారు. తాజాగా ఇందిరాపార్క్ వద్ద దీక్షను కూడా చేపట్టారు. బీసీల రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.ఇక ఇటీవలే పార్టీకి చెందిన సీనియర్ నేత జగదీశ్ రెడ్డిపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. లిల్లీపుట్ అంటూ ఎద్దేవా చేశారు. నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేసిన వ్యక్తి అంటూ మాట్లాడారు. కేసీఆర్ లేకుంటే జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉండే వారిని ప్రశ్నించారు.అంతేకాకుండా రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో యువ నాయకుడిని ఉద్దేశిస్తూ కూడా కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కూడా సీరియస్ గానే ఉంది. సీనియర్ నేత అయిన జగదీశ్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా బీఆర్ఎస్ కు దూరంగా ఉంటున్న కవిత?. జాగృతి జెండాతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో ఆఫీస్ ప్రారంభించిన కవిత? రాబోయే రోజుల్లో సంస్థను మరింత బలోపేతం చేస్తారని తెలుస్తోంది. అయితే ఆమె కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారన్న విశ్లేషణలు, అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కవిత మాత్రమే? తాను బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చే ప్రయత్నాలు చేయనంటూ కూడా చెబుతూ వస్తున్నారు.లేఖ లీక్ నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బీఆర్ఎస్ అధినాయకత్వం అన్నింటిని సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కవితపై చర్యలు తీసుకునే విషయాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే అలా జరిగితే కవిత.. నెక్ట్ ఏం చేస్తారనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది..! ఇలా కాకుండా? కవిత యూటర్న్ తీసుకొని కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తారా అన్న చర్చ కూడా ఓవైపు నుంచి వినిపిస్తోంది..!

# కాళేశ్వరం బాధ్యత నిర్మాణ సంస్థదే



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా భావించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం, ఆర్థిక అక్రమాలు చోటు చేసుకున్నట్లు జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్ తేల్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బారేజీల నిర్మాణంలో జరిగిన ప్లానింగ్, డిజైన్, నిర్మాణ సంబంధిత తప్పిదాలపై సుమారు 15 నెలల పాటు జరిపిన విచారణ అనంతరం ఆయన నివేదికను ఇటీవల సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం.. పనులపై ఎలాంటి బలమైన పర్యవేక్షణ లేకపోవడం, నాణ్యత నియంత్రణలో విఫలమయినట్లు.. నిర్మాణ సమయంలో అవకతవకలకు తావిచ్చే విధంగా నిర్వహణ సాగినట్లు తేలింది.ఘోష్ కమిషన్ ప్రధానంగా ఎల్అండ్‌టీ సంస్థపై తీవ్ర విమర్శలు చేసింది. మేడిగడ్డ బారేజ్‌లో 7వ బ్లాక్ పూర్తిగా దెబ్బతినడంతో, ఆ బ్లాక్ మరమ్మత్తు బాధ్యతను ఎల్అండ్‌టీనే భరిస్తుందని స్పష్టం చేసింది. తమ ఖర్చుతోనే దాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఎల్అండ్‌టీకి ఎలాంటి పూర్తి ధృవపత్రాలు ఇవ్వకూడదని నివేదిక పేర్కొంది. ఇదే విధంగా అన్నారం, సుందిల్ల బారేజీలకు బాధ్యత వహించిన సంస్థలు కూడా డిఫెక్ట్ లైయబిలిటీ పీరియడ్‌లో తలెత్తిన లోపాలను తమ ఖర్చుతో పరిష్కరించాలని సూచించింది. కమిషన్ తన నివేదికలో వివిధ స్థాయిల్లో తలెత్తిన లోపాలను వెలుగులోకి తీసుకొచ్చారు. నిర్మాణాల్లో మౌలిక లోపాలు (బ్యారెజ్ పొడవు.. నది వెడల్పు విషయంలో) స్పష్టంగా ఉన్నాయని, ఇవి సాంకేతిక ప్రమా ణాలను, నిబంధనలను ఖచ్చితంగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్యారేజీలు పెర్మియబుల్ ఫౌండేషన్ మీద డిజైన్ చేశారని, వాటిని స్టోరేజ్ స్ట్రక్చర్డ్‌గా వాడారని కమిషన్ పేర్కొంది. మోడల్ స్టడీలు లేకుండానే డిజైన్‌లను ఆమోదించారని, పనులపై టెక్నికల్ రివ్యూ చేపట్టలేదని తీవ్రంగా ఆక్షేపించారు. ప్రాజెక్టులో నాణ్యత నియంత్రణ పూర్తిగా అదుపుతప్పిన స్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సెకంట్ పైల్స్ వంటి కీలక నిర్మాణ భాగాల్లో నాణ్యతా ప్రమాణాలు అనుసరించలేదని స్పష్టం చేశారు. పనుల అనంతరం ఎలాంటి నిర్వహణ జరగకపోవడం, ప్రీ-పోస్ట్ మాన్సూన్ తనిఖీలను పూర్తిగా విస్మరించడం, నిర్వహణ రిపోర్టులు లేకపోవడం? ఇవన్నీ ప్రొటోకాల్‌ను ధిక్కరించడమే అని కమిషన్ అభిప్రాయప డింది. ప్రాజెక్ట్ వ్యయం కూడా అంచనాలను మించి మూడు రెట్లు పెరిగింది. ప్రారంభంలో రూ. 38,500 కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్.. చివరకు రూ. 1,10,248.48 కోట్ల ఖర్చుతో ముగిసింది. ఇది 186 శాతం అధిక వ్యయంగా నమోదైంది. ప్లానింగ్ దశలో నుంచి ఆర్థిక నియంత్రణ పాటిస్తే.. పరిస్థితి ఇంత ఇబ్బందికరంగా మారేది కాదని ఘోష్ తెలిపారు. పలు పనులు పూర్తి కాకముందే ఆయా కంపెనీలకు పూర్తయినట్టు ధృవీకరణ పత్రాలు ఇచ్చారని, ఇది సిస్టమటిక్ ఫెయిల్యూర్‌గా రిపోర్ట్ ఇచ్చారు.ఇతర అంశాల్లో, ప్రాజెక్ట్‌కు సంబంధించి ఉన్న సీనియర్ ఇంజినీర్లు సీ మురళీధర్, బీ హరిరామ్, ఏ నరేందర్ రెడ్డి, టి శ్రీనివాస్, ఓంకార్ సింగ్‌లు కమిషన్ ముందు తప్పుల సమాచారం ఇచ్చినట్టు తేలింది. కొంతమంది నిజాలను దాచారని, కొంతమంది తప్పుడు వివరాలతో కమిషన్‌ను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారని నివేదికలో పేర్కొనడం గమనార్హం.

## వివాహ రిషిప్షన్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి గారు



**రామాపురం ఆగస్టు 9 ప్రజా జ్యోతి** రామాపురం మండలం, నల్లగుట్టపల్లి గ్రామం కప్పకు చెందిన కనపర్తి సుబ్బారెడ్డి కుమారుడు నరసింహారెడ్డి వెడ్స్ హరితల వివాహ రిషిప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వదు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి గారు వారితో మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి,సర్పంచ్ వెంకటరెడ్డి, రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బరెడ్డి,కనపర్తి పెంచలరెడ్డి, చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి, దువూరు ఆంజనేయులు,సురేంద్ర రెడ్డి, బాబ్జి తదితరులు ఉన్నారు.

## మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

**మహేశ్వరంలో ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**డాక్టర్ వైద్యం చేసి వేయవలిన కుట్లు,గాజు పెంకును లోపలే పెట్టి కుట్లు వేసిన వాచ్ మెన్**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలి : బాధితుల డిమాండ్**

**రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేంద్రలోని ప్రభుత్వం ఆసుపత్రిలో గత నెల 27వ. తేదీ నా నందిగామ గిరి వర్మ అనే బాలుడు సాయంత్రం సమయంలో బయట ఆడుకుంటుండగా గాజు పెంకు కాలికి గుచ్చుకోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకెళ్లారు.డ్యూటీలో ఉన్న డాక్టర్ నిర్లక్ష్యంగా అక్కడే డ్యూటీ లో ఉన్న గేట్ వాచ్మెన్ తో కుట్లు వేయించడం వల్ల గాజు పెంకు కాలులోనే ఉండగానే కుట్లు వేయడం దారుణం.గాయం అయిన కాలు వాపు రావడంతో భయంతో ఒక రెండు రోజులు గడిచిన అనంతరం మరల హాస్పిటల్ కు వెళ్ళగా మాత్రలు రాసి పంపించారు. ఆల మూడు సార్లు వచ్చిన అదే పద్ధతిలో వచ్చిన బాలుడిని పంపించారు.కాలు వాపు మరింత రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ తియగా గాజు పెంకు ఉందిని డాక్టర్ చెప్పగా శుక్రవారం సాయంత్రం అతనికి సర్జరీ చేసి గాజు పెంకు బయటకు తీసారూ.పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రి వెళ్లలేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే డాక్టర్లు ఇలా నిర్లక్ష్యం చేస్తే పేద ప్రజలు ఎక్కడికి వెళ్లాలి అన్ని బాధితులు ప్రశ్నించారు. అలాగే బాలుడిని ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ పైన తగిన చర్యలు తీసుకోవాలిని బాధితులు డిమాండ్ చేశారు.

## హిమాయత్ సాగర్ నీరు విడుదల

## రాజేంద్రనగర్ సర్వీస్ రోడ్డు మూసివేత

రంగారెడ్డి : గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హిమాయత్ సాగర్ నిండుకుండను తలపిస్తుంది. హిమాయత్ సాగర్ నీటిమట్టం పెరగడంతో వెంటనే అప్రమత్తమైన జలమండలి అధికారులు నిన్న 4 గేట్స్ 1 ఫిట్ ఎత్తి వరద నీరును దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. దీంతో వరద నీరు హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై నుండి వెళ్తుండడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు రాజేంద్రనగర్ సర్వీస్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు.ప్రధానంగా సర్వీస్ రోడ్డులో రాజేంద్రనగర్ నుండి అప్పా జంక్షన్ వెళ్లేవారు, అప్పా జంక్షన్ నుండి రాజేంద్రనగర్ వచ్చేవారు బండ్లగూడ కిస్మత్పూర్ బుద్వేల్ నుండి వెళ్లాలని సూచించారు.వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతంలో హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంతాల వద్ద కూడా సెల్ఫీలు దిగడానికి ప్రజలు రావద్దని పోలీసులు సూచిస్తున్నారు...

## సైబర్ సెక్యూరిటీ రాజధానిగా హైదరాబాద్

దేశంలో సైబర్ సెక్యూరిటీకి రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు శాఖల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నగరంలోని పార్క్ హయత్ హోటల్‌లో శుక్రవారం జోహో కార్పొరేషన్‌కు చెందిన మ్యానేజ్‌ఇంజిన్ నిర్వహించిన షీల్డ్ ఎన్ఎక్స్ జీ 2025 ? సీఐఓ కనెక్ట్ సిరీస్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. తెలంగాణ దేశంలోనే మొట్టమొదటి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింద ..నెలకు 1,200 కుపైగా కేసులు పరిష్కరిస్తోంది. అత్యధిక శిక్ష విధింపు రేటు నమోదు చేసిన ఈ బ్యూరోను జిల్లాల స్థాయికి విస్తరిస్తున్నాం. స్టార్టప్‌లకు, గ్రామీణ ప్రాంత యువతకు సైబర్ మద్దతు అందించేందుకు చర్యలు చేపట్టాం'అని అన్నారు. జోహో సంస్థ తీసుకుంటున్న గ్రామీణ అభివృద్ధి మార్గాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. పట్టణ?గ్రామీణ మధ్య సాంకేతిక అంతరాన్ని తగ్గించాలన్న దిశగా ఇది చక్కటి ఉదాహరణ అన్నారు. డిజిటల్ పరిణామాల దృష్ట్యా డిజిటల్ ఇండియా యాక్ట్, డిపిడిపి యాక్ట్ అమలు కీలకమని పేర్కొన్నారు. ఎథికల్ హ్యాకింగ్ ఫెలోషిప్, సైబర్ హైజీన్ విద్య, ఏఐ ఆధారిత శిక్షణలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు.

## బండ్లగూడాలో వ్యభిచార ముఠా అరెస్ట్

**రంగారెరడ్డి :** బండ్లగూడా పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వ్యభిచార ముఠాను పోలీసులు బస్టు చేశారు. హాజీరా బేగం (41), షహ్నాజ్ ఫాతిమా (32), ఆటో డ్రైవర్ మొహమ్మద్ సమీర్ (23). ఇంకా రుపా అనే బంగ్లాదేశ్ మహిళను అదుపులోకి తీసుకున్నారు. సర్వార్ అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. బంగ్లాదేశ్కు చెందిన యువతిని పొరుగు మహిళ రుపా మాయమాటలకు లోనుచేసి అక్రమంగా ఇండియాకు తీసుకువచ్చి, హైదరాబాదులో వ్యభిచారానికి బలవంతం చేశారు. గత ఆరు నెలలుగా హోటళ్లకు తీసుకువెళ్లి పలువురు వ్యక్తులతో శారీరక దాడి జరిపించారు. ఒక హోటల్ దగ్గర పోలీస్ స్టేషన్ బోర్డు చూసిన బాధితురాలు, సమీర్ దృష్టికి చిక్కకుండా పరుగెత్తి పోలీసుల సహాయం కోరింది. వెంటనే పోలీసులు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, ముగ్గురు బాధితులను రక్షించారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం వెతుకుతున్నారు.

## బోలెరో వ్యాన్ ఢీకొన్న కారు..

## ప్రయాణికులు క్షేమం

**రంగారెడ్డి :** డిఎంఆర్ఎల్ చౌరస్తా ఫిసల్ బండలో. రోడ్డు పక్క బోలోరో వాహనం టైర్ మారుస్తుండగా వేగంగా వచ్చిన శాంట్రో కారు ఢీకొట్టింది. ఈ ఘటన లో శాంత్రో కారు స్వల్ప గాయాలయ్యాయి. ఫిసల్ బండాలోని ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో టైర్ మార్చేందుకు రోడ్డు పక్కన ఆగి ఉన్న బొలెరో పికప్ వాహనంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని శాంట్రో కారు ఢీకొట్టడంతో శాంట్రో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. కాంచన్బాగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చంద్రాయణగుట్ట ట్రాఫిక్ అధికారులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ టోయింగ్ వ్యాన్ సహాయంతో, దెబ్బతిన్న వాహనాన్ని రోడ్డు నుండి తొలగించి ట్రాఫిక్ను పునరుద్ధరించారు.

## ఖైరతాబాద్ గణనాధుడికి విశ్వశఆంతి

**హైదరాబాద్ :** భాగ్యనగరంలో ఏటా అంగరంగ వైభవంగా జరిగే గణేష్ ఉత్సవాలకు కేంద్ర బిందువైన ఖైరతాబాద్ గణపతి మరోసారి భక్తులను దీవించడానికి సిద్ధమవుతున్నాడు. ఈఏడాది ఇక్కడ 71వ సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని 69 అడుగుల భారీ విగ్రహం దర్శనం ఇవ్వనున్నారు.ఈ ఏడాది విగ్రహానికి 'విశ్వశాంతి' అని పేరు పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని పెంపొందించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. విగ్రహం తయారీ పనులు జూన్ 6న సర్వ ఏకాదశి సందర్భంగా మొదలయ్యాయి. ఆగస్టు 25 నాటికి పనులు పూర్తవుతాయని కమిటీ అంచనా వేస్తోంది. ఇప్పటివరకు 50%కి పైగా పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ తెలిపారు.

# వ్యాయామం చేసినంత మాత్రానా సన్నబడరా?



బరువు తగ్గడానికి వ్యాయామం చాలా ముఖ్యం అయినప్పటికీ, ఆరోగ్యకరమైన ఆహారం లేకుండా అది పూర్తిగా సాధ్యం కాదు. కేలరీల లోటును సృష్టించడానికి సమతుల్యమైన ఆహారం, వ్యాయామం రెండూ అవసరం. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర, ఒత్తిడి నిర్వహణ కూడా ముఖ్యం. బరువు తగ్గడానికి చాలా మంది వ్యాయామంపై మాత్రమే ఆధారపడతారు, కానీ ఇది అసంపూర్ణమైన చర్య. వ్యాయామం శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది. కొవ్వును కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది, కానీ మీరు మీ ఆహారంపై శ్రద్ధ చూపకపోతే, బరువు తగ్గడం కష్టం. వ్యాయామాలపై మాత్రమే ఆధారపడటం వల్ల బరువు తగ్గడంలో పెద్దగా ఫలితం ఉండదని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరాన్ని ఫిట్‌గా, శక్తివంతంగా ఉంచడానికి వ్యాయామం అవసరం, కానీ సరైన ఆహారంతో పాటు లేకపోతే, తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా కాలిపోయిన కేలరీలు తిరిగి వస్తాయి. అందువల్ల బరువు తగ్గడానికి, వ్యాయామంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించడం కూడా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో వ్యాయామంతో మాత్రమే బరువు ఎందుకు తగ్గదని మాకు తెలియజేయండి. బరువు తగ్గడం గురించి మాట్లాడేటప్పుడు, మనకు ముందుగా గుర్తుకు వచ్చేది వ్యాయామం. కానీ వాస్తవం ఏమిటంటే కేవలం వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గదు. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే, శరీరంలో బరువు పెరగడానికి అతిపెద్ద కారణం ఎక్కువ కేలరీలు తీసుకోవడం, తక్కువ ఖర్చు చేయడం. వ్యాయామం చేయడం ద్వారా, మనం కొంతవరకు కేలరీలను బర్న్ చేస్తా?ం, కానీ మనం ఆహారం ద్వారా అదే లేదా అంతకంటే ఎక్కువ కేలరీలు తీసుకుంటూ ఉంటే, బరువు తగ్గడానికి బదులుగా, బరువు పెరగవచ్చు. ఉదాహరణకు ఒక గంట జాగింగ్‌లో దాదాపు 400500 కేలరీలు బర్న్ అవుతాయి, కానీ మీరు తర్వాత అధిక కేలరీల చిరుతిండి లేదా ఫాస్ట్ ఫుడ్ తింటే చేసిన కష్టమంతా వృథా. అందువల్ల, బరువు తగ్గడానికి, వ్యాయామం మాత్రమే కాదు, జీవనశైలిలో సమతుల్యత కూడా ముఖ్యం. బరువు తగ్గడానికి ఆహారం, వ్యాయామం రెండింటి సమతుల్యత అవసరమని ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ జాన్ వివరిస్తున్నారు. వ్యాయామం కండరాలను టోన్ చేస్తుంది, జీవక్రియను మెరుగుపరుస్తుంది, శక్తి స్థాయిలను పెంచుతుంది. కానీ ఆహారం శరీరంలో కేలరీల తీసుకోవడం నియంత్రించే ప్రధాన అంశం. మీరు తక్కువ కొవ్వు, తక్కువ చక్కెర, అధిక ఫైబర్, పుష్కలంగా ప్రోటీన్, హైడ్రేషన్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరిస్తే, శరీరానికి అవసరమైన పోషకాహారం లభిస్తుంది, కొవ్వు నిల్వను నివారించవచ్చు. బరువు తగ్గడానికి రోజువారీ కేలరీల లోటు అంటే రోజువారీ కేలరీల తీసుకోవడం ఖర్చు చేసే కేలరీల కంటే తక్కువగా ఉండాలి. దీని కోసం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమయానికి తినడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, సమతుల్య ఆహారం చాలా ముఖ్యమైనవి. బరువు తగ్గడంలో 70 శాతం ఆహారం నుండి, 30 శాతం వ్యాయామం నుండి సాధ్యం అవుతుది.

# స్ట్రోక్ వచ్చే ముందు శరీరంలో కనిపించే సంకేతాలివే..

చాలా సార్లు మన శరీరం ప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటి గురించి సంకేతాలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. కానీ తరచుగా మనం చిన్న చిన్న విషయాలను విస్మరిస్తాము. అవి ప్రమాదకరంగా మారతాయి.. స్ట్రోక్ రాకముందే.. శరీరం మీ ప్రాణాలను కాపాడే 4 భయానక సంకేతాలను ఇస్తుంది. మీరు వాటిని సకాలంలో గుర్తించడం ద్వారా.. ప్రమాదాన్ని నివారించవచ్చు. ప్రజలు తరచుగా స్ట్రోక్‌ను అకస్మాత్తుగా జరిగేదిగా భావిస్తారు.. అది జీవితాన్ని క్షణంలో మార్చగలదు. కానీ వాస్తవికత ఏమిటంటే.. స్ట్రోక్ కు ముందు శరీరం తరచుగా ప్రమాద సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. ఈ సంకేతాలు ఎల్లప్పుడూ స్పష్టంగా కనిపించవు.. కానీ తేలికపాటి లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి.. స్ట్రోక్ అనేది మెదడుకు రక్త ప్రసరణకు అంతరాయం కలిగించే ఒక తీవ్రమైన వైద్య పరిస్థితి.. దీనివల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి లేదా చనిపోతాయి. ఇది ఒక అత్యవసర పరిస్థితి – తక్షణ వైద్య సంరక్షణ అవసరం.. స్ట్రోక్ లేదా బ్రెయిన్ స్ట్రోక్.. వల్ల ఇది మెదడు దెబ్బతినడం, దీర్ఘకాలిక వైకల్యం లేదా మరణానికి కూడా దారితీయవచ్చు. స్ట్రోక్ అనేది అకస్మాత్తుగా వచ్చే వ్యాధి అని అనుకుంటాం.. కానీ వాస్తవం భిన్నంగా ఉంటుంది. స్ట్రోక్ అనేది జీవితాన్ని క్షణంలో మార్చే సంఘటన అని చాలా మంది అనుకుంటారు. కానీ, శరీరం స్ట్రోక్ ప్రమాద సంకేతాలను చాలా ముందుగానే ఇవ్వడం ప్రారంభిస్తుందని పేర్కొంటున్నారు నిపుణులు.. స్ట్రోక్ కు సంబంధించి కొన్ని ప్రారంభ లక్షణాలను సకాలంలో గుర్తించడం ద్వారా .. తీవ్రమైన పరిస్థితిని నివారించవచ్చు. అకస్మాత్తుగా చాలా తీవ్రమైన తలనొప్పి వచ్చి, మందులు తీసుకున్న తర్వాత కూడా ఉపశమనం లభించకపోతే.. వెంటనే వైద్యులను సంప్రదించండి.. ఇంతకు ముందు ఎప్పుడూ అనుభవించని ఆకస్మిక తీవ్రమైన తలనొప్పి మెదడులో రక్తం గడ్డకట్టడానికి సంకేతం కావచ్చు. అన్ని తలనొప్పులు ఒత్తిడి లేదా నీటి కొరత వల్ల సంభవించవు. కొన్నిసార్లు అవి ఇతర వ్యాధుల సంకేతాలు కూడా. మరోవైపు, వికారం, సరిగ్గా చూడలేకపోవడం లేదా తలనొప్పితో వాంతులు వంటి సమస్య ఉంటే, దానిని తేలికగా తీసుకోకండి. కొన్నిసార్లు ఇది మైగ్రేన్ లేదా ఒత్తిడి వల్ల కలిగే తలనొప్పిగా అనిపిస్తుంది.. కానీ తేడా ఏమిటంటే లక్షణాలు మరింత తీవ్రంగా ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అలాగే, రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా అటువంటి గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ఎటువంటి కారణం లేకుండా ఎక్కిళ్ళు నిరంతరం వస్తుంటే, అది కూడా సాధారణం కాదు. ముఖ్యంగా మహిళల్లో, నిరంతర ఎక్కిళు ృ.. స్ట్రోక్ హెచ్చరిక సంకేతంగా పరిగణించబడతాయి. శ్వాస, మింగడాన్ని నియంత్రించే మెదడులోని భాగం ప్రభావితం కావడం ప్రారంభించినప్పుడు ఇది జరుగుతుంది. సాధారణంగా ఎక్కిళ్ళు కొంతకాలం తర్వాత ఆగిపోతాయి లేదా వాటంతట అవే నయమవుతాయి.. కానీ అది గంటలు లేదా రోజుల పాటు కొనసాగడంతోపాటు.. బలహీనత, మాట్లాడటంలో సమస్యలు లేదా శరీరంలో వింతగా అనిపిస్తే, మీరు వెంటనే ఆరోగ్య నిపుణుడిని సంప్రదించాలి. ఛాతీ నొప్పి ఎల్లప్పుడూ గుండెపోటుకు కారణం కాదు.. తరచుగా ఇది తేలికపాటి బిగుతు, మంట లేదా అసౌకర్యం వల్ల కూడా వస్తుంది. అదే సమయంలో, కొన్నిసార్లు ఛాతీ నొప్పిని ఆమ్లత్వం లేదా గ్యాస్ కారణంగా భావిస్తారు. కానీ ఛాతీ నొప్పి ప్రతిసారీ సాధారణం కాదు.



# లవంగాన్ని లైట్ తీసుకున్నారో మీరే లాస్ అవుతారు..?



లవంగాల్ని రాత్రిపూట నీళ్లలో నాన బెట్టి ఉదయం నీళ్లు తాగితే మలబద్ధకం ఉండదు. లవంగాల్ని ఎండబెట్టి, పౌడర్ లా చేసి పాలల్లో కల్పి తాగితే ఇమ్యునిటీ పెరుగుతుంది. లవంగాలు నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.. వీటిని తీసుకోవడం వల్ల నోటి పూతలు, దంతాల వాపు, చిగురువాపు వంటి చిగుళ్ల సంబంధిత సమస్యల పరిష్కారానికి లవంగ నూనె సాయపడుతుంది. లవంగాలలో పుష్కలంగా విటమిన్ లు, మినరల్స్ ఉంటాయి. రోజు రాత్రి పడుకునేటప్పుడు రెండు లవంగాల్ని తినాలని నిపుణులు చెబుతుంటారు. లవంగాలలో జుట్టు రాలడాన్ని నిరోధించే గుణాలు సమృద్ధిగా ఉంటాయి. లవంగాల్ని రాత్రిపూట నీళ్లలో నాన బెట్టి ఉదయం నీళ్లు తాగితే మలబద్ధకం ఉండదు. లవంగాల్ని ఎండబెట్టి, పౌడర్ లా చేసి పాలల్లో కల్పి తాగితే ఇమ్యునిటీ పెరుగుతుంది. లవంగాలు నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.. వీటిని తీసుకోవడం వల్ల నోటి పూతలు, దంతాల వాపు, చిగురువాపు వంటి చిగుళ్ల సంబంధిత సమస్యల పరిష్కారానికి లవంగ నూనె సాయపడుతుంది. లవంగాల నీళ్లను తాగే వారిలో బెల్లీ ఫ్యాట్లు ఉంటే కంట్రోల్ లోకి వస్తుంది. పీరియడ్స్ సమస్యలు, పెళ్లాయ్యాక కలయక వల్ల కలిగే సమస్యల్ని లవంగం దూరం చేస్తుంది. అందుకే చాలా మంది వంటలలో కూడా లవంగాల్ని తప్పకుండా ఉపయోగిస్తారు. అంతేకాదు.. లవంగాలు యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలతో క్యాన్సర్ నిరోధక లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఇవి క్యాన్సర్స్‌తో పోరాడడంలో దోహదం చేస్తాయి. కడుపులో అల్సర్‌తో బాధపడేవారికి కూడా లవంగాలు తీసుకోవడం మంచిది. ఇది నొప్పి, వాపు నుండి ఉపశమనం కలిగిస్తుంది. లవంగాల్లో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి వేగంగా బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి.

# గొంతు నొప్పితో బాధపడుతున్నారా..?



గొంతు నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ఈ సమయంలో ఆహారం తినడం కూడా కష్టం. కానీ కొన్ని ఆహారాలు చికాకును తగ్గించడానికి, మంటను తగ్గించడానికి సహాయపడతాయి. మరికొన్ని లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. జ్వరం వచ్చినప్పుడు గొంతు నొప్పి సాధారణం. ఈ సమయంలో నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ఆహారం కూడా తినలేని పరిస్థితి ఉంటుంది. కానీ కొన్ని ఆహారాలు చికాకు, మంటను తగ్గించడానికి సహాయపడతాయి. కొన్ని లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ సమయంలో మీరు తినవలసిన, తినకూడని ఆహారాలను పరిశీలిద్దాం. చికెన్ లేదా వెజిటబుల్ సూప్ వంటి వేడి పదార్థాలు గొంతు నొప్పిని తగ్గించడానికి, పోషకాలను అందించడానికి సహాయపడతాయి. చికెన్ సూప్ తేలికపాటి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. తేనె దాని యాంటీమైక్రోబయల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో గొంతును కూడా ఉపశమనం చేస్తుంది. ఇది దగ్గును కూడా తగ్గిస్తుంది. ముఖ్యంగా పడుకునే ముందు తినేటప్పుడు. గోరువెచ్చని హెర్బల్ టీ గొంతు కణాలను కూల్ చేస్తుంది. అల్లం, చమోమిలే లేదా గ్రీన్ టీ వంటి టీలు యాంటీమైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలను కలిగి ఉంటాయి. అరటిపండ్లు, యాపిల్‌సాస్ వంటి మృదువైన, ఆమ్లం లేని పండ్లు గొప్పవి. పెరుగు లేదా కూరగాయలతో స్మూతీలు ఉపశమనం కలిగిస్తాయి. వేయించిన ఆహారాలను నివారించండి. అవి గొంతు పొరను చికాకు పెట్టవచ్చు. మింగడానికి కష్టంగా ఉండే కూరగాయలు నొప్పిని మరింత తీవ్రతరం చేస్తాయి. నారింజ, మ్మకాయలు వంటి వాటి ఆమ్లత్వం గొంతు నొప్పిని మరింత తీవ్రతరం చేస్తుంది. పుల్లని సాస్‌లు, సూప్‌లను నివారించండి. అవి గొంతులో మరిన్ని సమస్యలను కలిగిస్తాయి. మిరపకాయ లేదా వేడి సాస్ వంటివి వాపు, అసౌకర్యాన్ని పెంచుతాయి. కార్బోనేటేడ్ పానీయాలు ఆమ్లత్వం, గొంతు చికాకును పెంచుతాయి. కాఫీ, కెఫిన్ కలిగిన పానీయాలు డీహైడ్రేషన్‌కు కారణమవుతాయి.



# మలబద్ధకంతో ఇబ్బందిపడుతున్నారా?

ఒత్తిడితో కూడిన జీవితం, జంక్ ఫుడ్ అలవాట్ల కారణంగా కడుపు సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీని నుంచి బయట పడటానికి అధిక మంది వైద్యులను సంప్రదిస్తుంటారు. అయితే కొంతమంది దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. నేటి జీవన శైలి కారణంగా అనేక మంది లైఫ్‌స్టైల్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీటిల్లో మలబద్ధకం ముఖ్యమైనది. ఇది ఎక్కువగా పర్యావరణం, ఆహారం వల్ల వస్తుంది. ఒత్తిడితో కూడిన జీవితం, జంక్ ఫుడ్ అలవాట్ల కారణంగా కడుపు సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీని నుంచి బయట పడటానికి అధిక మంది వైద్యులను సంప్రదిస్తుంటారు. అయితే కొంతమంది దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. కానీ ఈ సమస్యకు పరిష్కారం ఇంట్లోనే నిమిషంలో దొరుకుతుందనే సంగతి మీకు తెలుసా. ఈ కింది రెండు చిట్కాలతో ఈ సమస్యను సులువుగా పరిష్కరించవచ్చు. వంటగదిలో దొరికే రెండు పదార్థాలు మలబద్ధకం సమస్యను చిటికెలో నివారిస్తుంది. అదే జీలకర్ర నీరు, సోంపు నీరు. జీలకర్ర కడుపు ఆరోగ్యానికి ఓ వరం. దాని నీరు తాగడం వల్ల కడుపులో గ్యాస్, గుండెల్లో మంట, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది ఉబ్బరం, అపానవాయువు నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. జీలకర్ర కడుపులోని వాయువును బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. ఆమ్లత్వాన్ని కూడా తగ్గిస్తుంది. జీలకర్ర సహజ యాంటాసిడ్‌గా పనిచేస్తుంది. ఇది కడుపు చికాకును తగ్గిస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచుతుంది. జీవక్రియను కూడా పెంచుతుంది. జీలకర్ర నీరు జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో 1 టీస్పూన్ జీలకర్ర వేసి మరిగించాలి. సగం నీరు మిగిలిపోయాక, దానిని వడకట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగాలి. వీలైతే జీలకర్రను రాత్రంతా నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తాగడం మంచిది.మౌత్ ఫ్రెషనర్‌గా తినే సోంపు గింజలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటి ప్రభావం వల్ల కడుపు చల్లబరుస్తుంది. అందువల్ల కడుపు చికాకుకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఆమ్లత్వం, గుండెల్లో మంట నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సోంపు నీరు కడుపు వేడి, గుండెల్లో మంటను తగ్గిస్తుంది. సోంపు నీరు అజీర్ణాన్ని తగ్గిస్తుంది. ఇందులో జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేసే పదార్థాలు జీర్ణ సమస్యలను నివారిస్తుంది. కడుపు నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఫైబర్ కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# బిజినెస్

## మధ్యతరగతికి శాపంగా మారిన ఏఐ



ఏఐ వల్ల లాభాలు ఎన్నో కానీ ఉద్యోగాలకు మాత్రం ఏఐ ఎసరు పెడుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలలో ఇప్పటికే భారీగా ఉద్యోగాలు కోతకు గురయ్యాయి. టీసీఎస్, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ ఇలా పేరు మోసిన కంపెనీల్లో ఇటీవల భారీగా లే ఆఫ్స్ జరిగాయి. కొన్ని కంపెనీలలో ఒకేసారి 12వేల నుండి 15వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇక ఏఐతో మరింత ప్రమాదం పొంచి ఉందని గూగుల్ మాజీ ఉద్యోగి మో గౌదత్ వెల్లడించారు. ఓ పాడ్ కాస్ట్ లో ఆయన మాట్లా డుతూ... 2027 వరకు పరిస్థితులు చాలా మారిపోతాయన్నారు. ఏఐ గణనీయమైన మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. ముఖ్యంగా మధ్యతరగతి పతనానికి ఏఐ దారి తీస్తుందని నమ్ముతున్నా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టాప్ 1శాతంలో లేకపోతే మీరు రైతు అవుతారు, మధ్యతరగతి అనేదే ఉండదు అని చెప్పారు. 2027 నాటికి ఉన్నత విద్యావంతులైన వ్యక్తులు కూడా నిరుద్యోగులుగా మారవచ్చుని, దీనివల్ల ప్రస్తుత మధ్యతరగతిపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. 2027 నాటికి ప్రస్తుతం 350 మందితో పనిచేసే స్టార్టప్ కంపెనీలు కేవలం ముగ్గురితో పనిచేస్తాయని చెప్పారు. గతంలో పారిశ్రామికీకరణ కారణంగా మాన్యువల్ స్థానంలో యంత్రాలు వచ్చాయని, ఇప్పుడు విద్యావంతులైన ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆటోమేషన్ వస్తుందన్నారు.

## తగ్గనున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఈఎంఐలు




దేశీయ అతిపెద్ద ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కస్టమర్లకు భారీ ఊరట కల్పించింది. బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల ్ఆర్)ను తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది.సవరించిన రేట్లు ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయని వెల్లడించింది. బ్యాంకు నిర్ణయంతో వినియోగదారులు తీసుకునే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐల భారం తగ్గనుంది. ఎంపిక చేసిన రుణాల కాలవ్యవధులపై బ్యాంకు ఎంసీఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. రిటైల్ రుణాలపై ప్రభావం చూపే ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్ మాత్రం 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, సవరించిన తర్వాత రుణాల రేట్లు 8.55 శాతం నుంచి 8.75 శాతం మధ్య ఉంది. ఇదివరకు 8.60 శాతం నుంచి 8.80 శాతం మధ్య ఉండేది. కొత్త రేట్లకు సంబంధించి.. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.60 శాతానికి, 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.70 శాతానికి, ఏడాది ఎంసీఎల్ఆర్ 9.05 శాతం నుంచి 8.75 శాతానికి తగ్గించింది. 2 ఏళ్ల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం స్థిరంగా ఉంచింది. మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.75 శాతానికి తగ్గించింది.

# చిన్న పరిశ్రమలకు శరాఘాతం

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)లకు శరఘాతంగా మారాయి.యుఎస్ విధించిన 50 శాతం భారీ సుంకాలతో ఎంఎస్ఎంఇ ఎగుమతిదారులు తీవ్ర ఆందోళనకు గురి అవుతోన్నారు. ఇప్పటికే వేసిన సుంకానికి మరో 25 శాతం పెంచడంతో మొత్తం 50 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ట్రంప్ చర్యలు అత్యంత షాకింగ్‌గా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) పేర్కొంది. "ట్రంప్ చర్యలు భారత ఎగుమతులకు తీవ్రమైన ఎదురుదెబ్బ. యుఎస్ మార్కెట్‌కు వెళ్తున్న మన ఎగుమతులలో దాదాపు 55 శాతం నేరుగా ప్రభావితమవుతాయి. ఎగుమతిదారులపై ఖర్చు భారం పెరగనుంది. దీనివల్ల తక్కువ సుంకాలను ఎదుర్కొనే దేశాల ఎగుమతిదారులతో పోలిస్తే మన ఎగుమతిదారులు 30-35 శాతం పోటీతత్వ నష్టాన్ని చవి చూడాల్సి ఉంటుంది.' ఎఫ్ఐఇఒ డైరెక్టర్ జనరల్ అజరు సహారు తెలిపారు. అధిక టారిఫ్‌లు ముఖ్యంగా టెక్స్‌టైల్స్, మెరైన్ ఉత్పత్తులు (రొయ్యలు), లెదర్ రంగాలను తీవ్రంగా దెబ్బతీయనున్నాయి. ఆగస్టు 7 నుంచే తొలి దశ 25 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో ఇప్పటికే అనేక ఆర్డర్లు నిలిచిపోయాయని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కొత్త సుంకాలతో భారతీయ వస్తువులు అమెరికాలో అత్యధిక దిగుమతి సుంకం రేటును ఎదుర్కొంటున్నాయి. ఇది బ్రెజిల్‌తో సమానంగా ఉంది. "ఎంఎస్ఎంఇలు నడిపే అనేక రంగాలకు ఈ ఆకస్మిక వ్యయాలు, టారిఫ్‌ల పెరుగుదలను భరించడం సాధ్యం కాదు. లాభాలు ఇప్పటికే తక్కువగా ఉన్నాయి. ఈ అదనపు దెబ్బ వల్ల ఎగుమతిదారులు దీర్ఘకాల క్లయింట్‌లను కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ అధిక సుంకాలతో దేశీయ ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్‌లను వెతుక్కోవాల్సి ఉంటుంది." అని అజరు సహారు పేర్కొన్నారు. యుఎస్ సుంకాలు సుమారు 47.6 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను నేరుగా ప్రభావితం చేస్తాయి. ఇది భారతదేశ ఎగుమతులలో 55 శాతానికి సమానం. అందులోనూ ఎంఎస్ఎంఇలపై అధిక ప్రభావం ఉండనుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అధిక టారిఫ్‌లు టెక్స్‌టైల్స్, మెరైన్ ఉత్పత్తులు, లెదర్ రంగాల్లోని లక్షలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆ పరిశ్రమ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. టెక్స్‌టైల్ తయారీలో 40 లక్షల మంది, దుస్తుల ఉత్పత్తిలో 1.11 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారని అంచనా. ఈ సుంకాల వల్ల ఆర్డర్లు నిలిచిపోవడానికి తోడు టారిఫ్‌లు పెరగడం వల్ల ఎంఎస్ఎంఇలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొం టాయి. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో 5.3 బిలియన్ డాలర్ల వస్త్రాలు, తోలు, పాదరక్షలకు సంబంధించి 1 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు జరిగాయి. ఆయా రంగాల్లో యుఎస్ చర్యలతో భారత్‌లోని లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుంకాలు తగ్గకపోతే భారీగా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఎఫ్ఐఇఒకు చెందిన ఓ ప్రతినిధి పేర్కొన్నారు. "అధిక సుంకాలు టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతి దారులకు భారీ ఎదురుదెబ్బ. అదే విధంగా వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీపడే సామర్థ్యాన్ని భారీగా బలహీన పర్చనుంది." అని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సిఐటిఐ) ఛైర్మన్ రాకేష్ మెహ్రా పేర్కొన్నారు. దీనిపై తక్షణ ప్రభుత్వ జోక్యం అవసరమని అన్నారు.



## అమెరికాలో భారత పచ్చళ్ళ వ్యాపారం విలువ రూ. 20 వేల కోట్లు

భారతదేశం సుగంధ ద్రవ్యాలకు పుట్టినిల్లు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా, అతిపెద్ద ఎగుమతిదారుగా కూడా నిలుస్తోంది. భారతదేశం ప్రతియేటా సుమారు రూ. 20,000 కోట్ల విలువైన పచ్చళ్ళు, పాపడ్‌లు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా కెనడా, యుకె, అమెరికాలో ఈ ఉత్పత్తులకు భారీగా డిమాండ్ ఉంది. 2023-24లో రూ. 36,958.80 కోట్ల విలువైన స్పైసెస్ ను ఎగుమతి చేయగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరునెలల్లోనే భారత్ రూ. 29,016 కోట్ల (ఖువి 3.36 బిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసి రికార్డ్ నెలకొల్పింది. 2027 నాటికి 10 బిలియన్ డాలర్ల ఎగుమతిని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో ఒక్క అమెరికానే రూ. 5,136 కోట్ల (ఖువి 594.82 మిలియన్) విలువైన స్పైసెస్ ను దిగుమతి చేసుకోగా.. రూ. 2,766 కోట్ల (ఖువి 320.36 మిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను యూకే దిగుమతి చేసుకుంది. అమెరికాలో వీటి డిమాండ్ ప్రతియేటా 10% పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా, కెనడా, యుకెలతో సహా అన్ని యూరప్ దేశాల్లో భారతీయ పచ్చళ్లకు, పాపడ్‌లకు డిమాండ్ ఎక్కువే. అక్కడి మార్టుల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతాయి. చాలాసార్లు ఔట్ ఆఫ్ స్టాక్ బోర్డులు కూడా దర్శనం ఇస్తాయి. అయితే ఇందుకు గల ప్రధాన కారణం భారత్ నుంచి విదేశాలకు పెరుగుతున్న భారీ వలసలు అంటున్నారు నిపుణులు. అలాగే విదేశీయుల్లో భారతీయ రుచుల పట్ల ఆసక్తి, ఆరోగ్యకరమైన సేంద్రీయ ఆహార ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న ఆదరణ కూడా కారణమే అంటున్నారు. ఉదాహరణకు కెనడాలో భారతీయ రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లలో మామిడి, నిమ్మ వంటి పచ్చళ్ళు, భారత్ నుంచి ఎగుమతయ్యే బియ్యం, పాపడ్‌లకు గిరాకీ ఎక్కువగా ఉంది. అలాగే యుకెలో కూడా పచ్చళ్ళు, పాపడ్‌లు బ్రిటిష్-ఇండియన్



వంటకాలలో ప్రధాన భాగంగా మారాయి. భారత్ తన నిర్దిష్ట లక్ష్యాన్ని చేరాలంటే ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు, అంతర్జాతీయ ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఎగుమతులు ఉండటం, మార్కెట్ అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఇంకా ఉన్నట్టు తెలుస్తోంది.

# స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్..
# ప్రపంచంలోనే తొలి జట్టుగా రికార్డు

జింబాబ్వే పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టు పసికూనకు చుక్కలు చూపిస్తోంది. తొలి టెస్టులో ఆతిథ్య జింబాబ్వేను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసిన కివీస్ టీమ్.. రెండో టెస్టులోనూ అదరగొడుతోంది. శుక్రవారం నాటి రెండో రోజు ఆట ముగిసే సరికి ఏకంగా 476 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

**125 పరుగులకే ఆలౌట్**

కాగా బులవాయో వేదికగా గురువారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే తొలుత బ్యాటింగ్ చేసింది. కివీస్ బౌలర్లు ఆకాశమే హద్దుగా విజృంభించడంతో 125 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రెండన్ టేలర్ (44), వికెట్ కీపర్ బ్యాటర్ టఫాజ్వ త్సింగా (33 నాటౌట్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. మిగిలిన వారిలో నిక్ వెల్చ్ (11), సీన్ విలియమ్స్ (11) మాత్రమే పది పరుగుల స్కోరు దాటాడు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ ఐదు వికెట్లతో చెలరేగగా.. జకారీ ఫౌల్క్స్ నాలుగు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మాథ్యూ ఫిషర్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. అనంతరం తమ తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా



పయనిస్తోంది.

**కాన్వే, రచిన్, నికోల్స్ భారీ శతకాలు**

ఓపెనర్లలో డెవాన్ కాన్వే (245 బంతుల్లో 153) శతక్కొట్టగా.. విల్ యంగ్ (%ఔఱశ్రీశ్రీ ‾శీబఅస్త్ర%) హాఫ్ సెంచరీ (74)తో రాణించాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన బౌలర్ జేకబ్ డఫీ మాత్రం 36 పరుగులే చేయగలిగాడు. అయితే, హెన్రీ నికోల్స్, రచిన్ రవీంద్ర కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రచిన్ కేవలం 139 బంతుల్లోనే 165 పరుగులతో అజేయంగా ఉండగా.. నికోల్స్ 245 బంతుల్లో 150 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఫలితంగా రెండో రోజు ఆట పూర్తయ్యేసరికి 130 ఓవర్లలో న్యూజిలాండ్ కేవలం? మూడు వికెట్ల నష్టానికి 601 పరుగుల భారీ స్కోరు సాధించింది. జింబాబ్వే కంటే తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

**ప్రపంచంలోనే తొలి జట్టుగా**

కాన్వే, నికోల్స్, రచిన్‌ల భారీ సెంచరీల కారణంగానే ఇది సాధ్యమైంది. ఈ క్రమంలోనే న్యూజిలాండ్ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర లిఖించింది. విదేశీ గడ్డ మీద ఓ టెస్టు మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు ఆటగాళ్లు 150కి పైగా వ్యక్తిగత స్కోర్లు సాధించడం ఇదే తొలిసారి. తద్వారా ప్రపంచంలో ఈ ఘనత సాధించిన మొదటి జట్టుగా కివీస్ అవతరించింది. ఇక ఓవరాల్‌గా ఈ జాబితాలో ఇంగ్లండ్ (1938 లో ఓవల్ వేదికగా ఆస్ట్రేలియా మీద మూడు 150ం స్కోర్లు), టీమిండియా (శ్రీలంక మీద కాన్పూర్‌లో మూడు 150ం స్కోర్లు) న్యూజిలాండ్ కంటే ముందు వరుసలో ఉన్నాయి.

## ఆకాశ్‌దీప్‌ను నిషేధించాలి.. బెన్ డకెట్ కోచ్ డిమాండ్..!

భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ ముగిసింది. కానీ, చివరి టెస్ట్ వివాదం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. సిరీస్ 2-2 తేడాతో డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ సమయంలో మైదానంలో ఆటగాళ్ల మధ్య చాలా విభేదాలు కనిపించాయి. అయితే, కెన్నింగ్టన్ ఓవల్‌లో జరిగిన ఐదవ మ్యాచ్‌లో జరిగిన ఘటనపై ఇంకా చర్చ సాగుతూనే ఉన్నది. ఇది టీమిండియా బౌలర్ ఆకాశ్ దీప్‌కు సంబంధించింది. అయితే, ఇందులో ఫాస్ట్ బౌలర్ తప్పేం లేకపోయినా ఇంగ్లిష్ ప్లేయర్ బెన్ డకెట్ కోచ్ ఆకాశ్ దీప్‌ను నిషేధించాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ఓవల్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో డకెట్‌ను ఆకాశ్ దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో ఆకాశ్ దీప్ డకెట్ భుజంపై చేసి వేసి మాట్లాడడం కనిపించింది. ఈ సమయంలో ఆకాశ్ దీప్ నవ్వుతూ ఏదో చెప్పాడు. ఇద్దరూ మంచి స్నేహితుల్లా కనిపించారు. ఈ సిరీస్‌లో డకెట్‌ను




ఆకాశ్‌దీప్ పలుసార్లు అవుట్ చేశాడు. పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో డకెట్ వద్దకు చేరుకోవడంతో కేఎల్ రాహుల్ ఆకాశ్ను దూరం తీసుకువెళ్లాడు. సిరీస్ ముగిసిపోయినా ఇందుకు సంబంధించి వివాదం కొనసాగుతున్నది. పలువురు క్రికెట్ పండితులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆకాశ్‌దీప్ అలా చేసి ఉండకూడదని పేర్కొంటున్నారు. అయితే, బ్యాట్స్‌మెన్ అవుట్ అయినప్పుడు చాలా కోపంగా ఉంటారని పేర్కొంటున్నారు. ఆకాశ్‌పై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా డకెట్ వ్యక్తిగత కోచ్ జేమ్స్ నాట్ మాత్రం కొన్ని మ్యాచుల నుంచి నిషేధించాలని టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐసీసీని డిమాండ్ చేశారు. ఇదంతా సిరీస్‌లో భాగమైనా.. యువ ఆటగాళ్లు ఇలాంటి వాటి నుంచి ప్రేరణ పొందకుండా ఉండేందుకు ఆకాశ్‌దీప్‌పై నిషేధం విధించాలని.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఈ సిరీస్‌లో డకెట్ 51.33 సగటుతో 462 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ కూడా 82.94గా ఉన్నది. డకెట్ చాలా ప్రశాంతమైన బ్యాట్స్‌మెన్ అని.. చాలాపోటీతత్వం అతనిలో ఉందని నాట్ తెలిపారు.

## టీ20 వరల్డ్‌కప్-2026లో ఆసీస్ ఓపెనర్లు వీరే



వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా తమ ఓపెనింగ్ జోడీని ఖరారు చేసింది. కెప్టెన్ మిచెల్ మార్ష్‌తో పాటు ట్రవిస్ హెడ్ వరల్డ్‌కప్ దాకా ఓపెనర్లుగానే కొనసాగుతారని స్పష్టం చేసింది. సీఏ తరపున కెప్టెన్ మిచెల్ మార్ష్ ఈ విషయాన్ని వెల్లడించాడు.

**గొప్ప అనుబంధం**

"నేను, హెడీ (ట్రవిస్ హెడ్) సుదీర్ఘకాలం పాటు ఓపెనర్లుగానే ఉంటాము. మేమిద్దరం కలిసి ఎన్నో మ్యాచ్‌లు ఆడాము. మా మధ్య గొప్ప అనుబంధం ఉంది" అని మిచెల్ మార్ష్ తెలిపాడు. సౌతాఫ్రికాతో సొంతగడ్డపై పరిమిత ఓవర్ల సిరీస్‌కు ముందు మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు. కాగా వన్డేల్లో ఓపెనింగ్ జోడీగా ట్రవిస్ హెడ్- మిచెల్ మార్ష్‌కు మంచి రికార్డే ఉంది. ఐదు ఇన్నింగ్స్‌లో కలిపి 70.50 సగటుతో వీరిద్దరు కలిసి 282 పరుగులు రాబట్టారు. ఇక అన్ని ఫార్మాట్లలో కలిపి 504 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇదిలా ఉంటే.. 2021 టీ20 ప్రపంచకప్ టోర్నీలో మార్ష్ మూడో స్థానంలో బరిలోకి దిగి అదరగొట్టాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్లో 50 బంతుల్లో 77 పరుగులతో అజేయంగా నిలిచి.. జట్టును విజేతగా నిలిపాడు. తద్వారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత.. డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ నేపథ్యంలో మార్ష్ ఓపెనర్‌గా ప్రమోట్ అయ్యాడు. అయితే, ఇటీవల వెస్టిండీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో బ్యాటర్ (81 పరుగులు)గా విఫలమైనా కెప్టెన్‌గా మాత్రం రాణించాడు. మార్ష్ సారథ్యంలో ఆసీస్ 5-0తో వెస్టిండీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. కాగా గతేడాది వార్నర్ రిటైర్ అయిన తర్వాత.. మ్యాట్ షార్ట్,గ్లెన్ మాక్స్‌వెల్, జేక్ ఫ్రేజర్-మెగర్క్.. ఇలా చాలా మందిని ఓపెనర్లుగా ట్రై చేసింది ఆస్ట్రేలియా. అయితే, చివరకు మార్ష్- హెడ్ జోడీని ఫైనల్ చేసింది.

**ప్రమాదకరంగా ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్**

ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచకప్-2026 టోర్నీకి మార్ష్- హెడ్ ఆసీస్ ఓపెనర్లుగా ఖరారు కాగా.. డేంజరస్ బ్యాటర్లతో జట్టు మొత్తం పటిష్టంగానే కనిపిస్తోంది. ఇటీవల వెస్టిండీస్ పర్యటనలో 37 బంతుల్లోనే శతకం బాదిన టిమ్ డేవిడ్.. ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ టీ20లలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మరోవైపు.. 23 ఏళ్ల మిచెల్ ఓవెన్ అరంగేట్రంలోనే 26 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. వీరితో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ కామెరాన్ గ్రీన్ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. ఇక గ్లెన్ మాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏదేమైనా ఈసారి ఆసీస్ ప్రపంచకప్ టోర్నీలో ప్రత్యర్థులకు గట్టిపోటీనివ్వడం ఖాయం అనిపిస్తోంది.



## 50' క్రాస్ చేసిన మహేశ్.. భార్య క్యూట్ విషెస్

తెలుగు హీరో మహేశ్ బాబు.. 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలోనే టాలీవుడ్ సెలబ్రిటీలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. మరోవైపు మహేశ్ భార్య నమ్రత కూడా క్యూట్ అండ్ లవ్లీ విషెస్ చెప్పింది. తనకు బలం, సర్వస్వం నువ్వే అని చెబుతూ ఫ్యామిలీ ఫొటోని పంచుకుంది. ఈ పోస్ట్‌కి మహేశ్ ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. దాదాపు 25 ఏళ్లుగా సినిమాలు చేస్తున్న మహేశ్ బాబు.. తన నటనతో పాటు వ్యక్తిగతంగానూ ఎంతోమంది అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఈ క్రమంలో చాలామంది పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. అలానే థియేటర్లలో రీ రిలీజ్ అయిన 'అతడు' చూసి ఎంజాయ్ చేస్తున్నారు. మిగతా వాళ్లు విషెస్ చెప్పడం సంగతి చెప్పడం కంటే మహేశ్‌కి భార్య నమ్రత తన విషెస్ చెప్పడం ప్రత్యేకంగా నిలిచింది. 'నా జీవితాన్ని ఓ అందమైన కలలా మార్చిన మనిషికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నా లవ్, నా బలం, నా సర్వస్వం. ఎప్పటికీ నిన్నే ప్రేమిస్తుంటా మహేశ్' అని నమ్రత తన ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది. మరోవైపు మహేశ్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి మూవీ నుంచి చిన్న అప్‌డేట్ కూడా వచ్చింది. నవంబర్‌లోనే సినిమా నుంచి కీలక అప్‌డేట్ ఇస్తామని, అప్పటివరకు వెయిటింగ్ తప్పదు అని ఓ పోస్టర్ రిలీజ్ చేశారు

## సెట్‌లో కోచ్ సూచనలతోనే.. సన్నిహిత సన్నివేశాల షూట్‌పై తమన్నా కామెంట్స్ వైరల్



తెలుగు సినిమా ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఉత్తరాది భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా బాటియా. రెండు దశాబ్ధాల కెరీర్‌లో తను ఏ సినిమాకు సైన్ చేసినా నో కిస్ నిబంధన ఉండటం చాలా మందికి తెలియని విషయం తెలిసిందే. సుదీర్ఘ సినీ కెరీర్‌లో ఏ సినిమాలో కోసం లిప్ లాక్ సీన్లలో నటించలేదు. లస్ట్ స్టోరీస్ సినిమాతో ఆ రూల్‌ను పక్కన పెట్టేసింది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ బోల్డ్ సన్నివేశాల్లో కనిపిస్తూ హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. అయితే సన్నిహిత సన్నివేశాల్లో నటించే విషయంపై తొలిసారి తన స్పందనను తెలియజేసింది మిల్కీ బ్యూటీ. ఓ నటిగా బలమైన కంటెంట్ ఉన్న సినిమాల్లో తప్పనిసరి అయిన బోల్డ్ సీన్లు, సన్నిహిత సన్నివేశాల్లో నటించే అంశంలో తనకు తాను పరిమితులు విధించుకున్నట్టు చెప్పింది తమన్నా. బోల్డ్ సన్నివేశాలు పూర్తిగా ఫేక్. ప్రతీ సన్నిహిత సన్నివేశాన్ని సెట్‌లో కోచ్ పర్యవేక్షణలో చిత్రీకరణ చేస్తారు. అలాంటి సీన్లలో నటించేటప్పుడు మేల్ కోస్టార్లకు కొన్ని ప్రాంతాల్లో టచ్ చేయొద్దని కోచ్ ప్రత్యేక సూచనలు ఇస్తారని చెప్పుకొచ్చింది. అంతేకాదు అలాంటి సన్నివేశాలు సెట్‌లో అందరూ ఉండగానే సరైన సూచనలతో చాలా జాగ్రత్తగా షూట్ చేస్తారు. ప్రతీ కదలికను డ్యాన్స్ స్టెప్పులను కొరియోగ్రఫీ చేసినట్టుగా షూట్ చేస్తారంటూ చెప్పుకొచ్చింది. తమన్నా చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది ఓదెల 2 సినిమాతో ప్రేక్షకులను పలుకరించిన ఈ భామ ప్రస్తుతం 4 హిందీ సినిమాలను లైన్‌లో పెట్టింది.




## సినిమాల్లోకి వడ్డే నవీన్ రీ ఎంట్రీ.. 'త్రిమూర్తులు' ఫస్ట్ లుక్ విడుదల

ప్రముఖ తెలుగు నటుడు వడ్డే నవీన్ చాలా రోజుల తర్వాత మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఈ సినిమాకు కమల్ తేజ నార్ల దర్శకత్వం వహిస్తుండగా వడ్డే క్రియేషన్స్ బ్యానర్‌పై వడ్డే నవీనే ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వడ్డే నవీన్‌తో పాటు వరలక్ష్మి శరత్ కుమార్ కూడా ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. నేడు రాఖీ పండుగ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ చిత్రంలో వడ్డే నవీన్ కానిస్టేబుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం.

## 10 క్లాస్ ఫెయిల్ .. కట్ చేస్తే ఇండస్ట్రీలో తోప్.. రూ.200కోట్లకు మహారాణి ఈ భామ



చాలా మంది ముద్దుగుమ్మలు చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి వచ్చి సక్సెస్ అయ్యారు. అలాగే కొంతమంది ముద్దగుమ్మలు పెద్దగా చదువుకోకపోయినా సెలబ్రేటీలుగా మారి మంచి క్రేజ్ తెచ్చుకున్నారు. అలంటి వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ ముద్దుగుమ్మ 10%ష్త్ర% క్లాస్ కూడా పాస్ కాలేదు.. కానీ రెమ్యునరేషన్ మాత్రం రూ.25 కోట్లు.. ఆస్తులు రూ.200 కోట్ల పైనే..ఇంతకూ ఆ వయ్యారి భామ ఎవరో తెలుసా..? ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసి రాణించింది ఆ వయ్యారి. ఇంతకూ ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు, వెంకటేష్, బాలకృష్ణ లాంటి లెజెండ్ యాక్టర్స్ సరసన నటించి మెప్పించింది ఆమె. కానీ ఆమె టాలీవుడ్ భామ కాదు. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణిస్తున్న ఆ అమ్మడు.. తెలుగులో రెండే రెండు సినిమాలు చేసింది. ఆమె మరెవరో కాదు కత్రినా కైఫ్. ఈ భామ తెలుగులో వెంకటేష్ తో మల్లీశ్వరి సినిమా చేసింది. అలాగే బాలయ్యబాబుతో అల్లరి పిడుగు సినిమా చేసింది. బాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా దూసుకుపోతుంది ఈ అమ్మడు. కత్రినా కైఫ్ పదవతరగతి కూడా పాస్ కాలేదు.. కానీ ఈ బ్యూటీ ఒకొక్క సినిమాకు రూ.25 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. బాలీవుడ్ లో స్టార్ హీరోలందరి సరసన నటించింది. అలాగే ఈ అమ్మడి ఆస్తి దాదాపు రూ. 200కోట్లకు పైనే.. ఈ చిన్నది బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్ ను పెళ్లాడింది. పెళ్లి తర్వాత ఈ చిన్నది సినిమాల స్పీడ్ తగ్గించింది. కత్రినా కైఫ్ ప్రస్తుతం ఎలాంటి చిత్రాల్లోనూ నటించడం లేదు. చివరిసారిగా ఆమె విజయ్ సేతుపతి సరసన 'మెర్రీ క్రిస్మస్' చిత్రంలో కనిపించింది. గతేడాది ఈ మూవీ రిలీజైంది. ప్రస్తుతం కత్రినా సినిమాల స్పీడ్ తగ్గించింది. అడపాదడపా సినిమాలు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com